Follow: @ANNTELUGU
22-04-2026
ANN తెలుగు
# మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 115 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM


మహా స్పెషల్ 4

తమిళ తంత్రం.. గెలుపు మంత్రం

ముక్కోణంలో ముందున్నదెవరు?

డీఎంకే కూటమి వైపు మొగ్గు.. చెన్నై సిటీలో విజయ్ జోరు

వారసత్వ పోరులో స్టాలిన్ టాప్

సర్వేలన్నీ డీఎంకే మాటే....

- లోక్ పోల్ మెగా సర్వే ప్రకారం.. డీఎంకే 40 శాతం ఓట్లతో 180 నుంచి 190 సీట్ల వరకు దక్కించుకుంటుందని తేలింది. తద్వారా స్టాలిన్ మరోసారి సీఎంగా ఎన్నికయ్యే అవకాశం ఉంది. ఒక్కో నియోజకవర్గంలో 500 మందితో.. లక్ష మంది శాంపిల్స్ తీసుకొని ఈ సర్వే చేసినట్లు సదరు సంస్థ ప్రకటించింది. డీఎంకే వ్యతిరేక ఓటు చీలిపోవడంతో స్టాలిన్ కు కలిసి వచ్చే అంశంగా తేల్చింది.
- ప్యారా పోల్ సర్వే ప్రకారం.. డీఎంకే 41.5% ఓట్లు సాధిస్తుందని.. అన్నా డీఎంకే కూటమి 36.2% ఓట్లు సాధిస్తుందని.. టీవీకే విజయ్ పార్టీ 13.6% ఓట్లు... ఎన్టీకే 7.9% ఓట్లను పొందే అవకాశం ఉంది. ఈ సర్వే ప్రకారం డీఎంకే స్పష్టమైన మెజారిటీతో మరోసారి అధికారం చేపట్టే ఛాన్స్ కనిపిస్తోంది.
- అగ్ని న్యూస్ సర్వీస్ సర్వే ప్రకారం డీఎంకే సూపర్ విక్టరీ సాధిస్తుందని తేలింది. ఆ పార్టీ ఏకంగా 180 నుంచి 234 సీట్లు దక్కించుకుంటుందని సర్వే తేల్చింది. అన్నా డీఎంకే 54 సీట్లతో నిలవచ్చు అని తేల్చి చెప్పింది.
- ఐఏఎన్ఎస్ మ్యాట్రిజ్ సంస్థ మాత్రం అన్నా డీఎంకే కు ఆధిక్యత ఉంటుందని తేల్చింది. 11 నుంచి 127 సీట్లతో ముందు వరుసలో నిలవనుంది. డీఎంకే కనిష్టంగా 104, గరిష్టంగా 114 సీట్లను సాధిస్తుందని తేల్చింది. హంగ్ వస్తుందని తేల్చి చెప్పింది.
- న్యూస్ 18 ఓటు వైపు సర్వే డీఎంకెకు స్వల్ప హెచ్చు ఉంటుందని తేల్చింది. డీఎంకే కు 40 శాతం, అన్నా డీఎంకెకు 38% ఓట్లు వచ్చే అవకాశం ఉంది. విజయ్ పార్టీకి 15 శాతం వరకు ఓట్లు వస్తాయని తేల్చింది.
- లయోలా కాలేజ్ ఐపిడిఎస్ సర్వేలో విజయ్ పార్టీ పరిస్థితి బాగుంటుందన్న ఫలితాలు వచ్చాయి. విజయ్ పార్టీ ఏకంగా 50 సీట్లు వరకు సాధించవచ్చని.. 80 సీట్లలో ఆ పార్టీ రెండో స్థానంలో నిలుస్తోందని చెబుతోంది. ప్రత్యేకించి యువత విజయ్ పార్టీ వైపు మొగ్గు చూపినట్లు తేల్చింది.

డబుల్ ఇంజిన్ సర్కార్‌పై వ్యతిరేకత

హిందీ బెల్ట్ రాజకీయాలకు భిన్నంగా తమిళనాడు తన ప్రత్యేకతను చాటుకుంటూవస్తోంది. కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వంపై తమిళ ఓటర్లు 2021లోనే ఆగ్రహం వ్యక్తం చేశారు. 51.9 శాతం మంది కేంద్ర ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేయగా, 47.5 శాతం మంది కేంద్రంలో ఉన్న పార్టీయే రాష్ట్రంలో ఉండాలి అనే (డబుల్ ఇంజిన్) వాదనను తిరస్కరించారు. బీజేపీ ఏదుగుదల రాష్ట్ర సామాజిక ఐక్యతకు కీడు అని 40.3 శాతం మంది అభిప్రాయపడటం గమనార్హం. ఇక తాజాగా డీ లిమిటేషన్ అంశంలో లోక్ సభ సాక్షిగా ఎన్డీఏ ఓడిపోవడం.. డీఎంకేకు కలిసొచ్చింది.

మహా పత్రిక బుధవారం, హైదరాబాద్ 22-04-2026

తమిళనాడు ఎన్నికల బరిలో నిలిచిన స్టార్ అభ్యర్థులు

ఎం.కె. స్టాలిన్ (డీఎంకే)
నియోజకవర్గం: కొలత్తూరు ప్రస్తుత ముఖ్యమంత్రిగా ఉన్న స్టాలిన్, తన బలమైన కోట అయిన కొలత్తూరు నుండి మళ్ళీ పోటీ చేస్తున్నారు. సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల కల్పన మరియు సుస్థిర పాలనే లక్ష్యంగా ఆయన ప్రచారం సాగుతోంది. డీఎంకె విజయావకాశాలు పూర్తిగా ఆయన చరిష్మాపైనే ఆధారపడి ఉన్నాయి.

అన్బుమణి రామదాస్ (పీఎంకే)
కూటమి: ఎన్డీఏ ఉత్తర తమిళనాడులో బలమైన ఓటు బ్యాంకు ఉన్న పీఎంకె నేత అన్బుమణి, ఎన్డీయే కూటమిలో కీలక భాగస్వామి. వన్నియర్ సామాజిక వర్గ ఓట్లను సమీకరించడంలో ఆయన ప్రభావం ఈ ఎన్నికల ఫలితాలపై ఖచ్చితంగా ఉంటుంది.

ఉదయనిధి స్టాలిన్ (డీఎంకే)
నియోజకవర్గం: చేపాక్-తిరువల్లిక్కేని డీఎంకె తదుపరి వారసుడిగా, యువతలో మంచి ఫాలోయింగ్ ఉన్న నేతగా ఉదయనిధి ఈ ఎన్నికల్లో కీలకంగా మారారు. పార్టీలో మరియు ప్రభుత్వంలో ఆయన ప్రాధాన్యత పెరగడం వల్ల, ఈ స్థానంలో ఆయన విజయం పార్టీ భవిష్యత్తు నాయకత్వానికి ఒక సంకేతంగా నిలవనుంది.

తమిళిసై సౌందరరాజన్ (బీజేపీ)
నియోజకవర్గం: మైలాపూర్ మాజీ గవర్నర్ తమిళిసై, చెన్నైలోని ప్రతిష్ఠాత్మక మైలాపూర్ స్థానం నుండి బరిలోకి దిగారు. పట్టణ ఓటర్లను ఆకట్టుకోవడమే కాకుండా, బిజెపిని తమిళనాడులో ఒక ప్రత్యామ్నాయ శక్తిగా నిలబెట్టడానికి ఆమె తీవ్రంగా కృషి చేస్తున్నారు.

ఎడప్పాడి కె. పళనిస్వామి (ఎఐఎడిఎంకె)
నియోజకవర్గం: ఎడప్పాడి ప్రతిపక్ష నేత పళనిస్వామి, అన్నాడీఎంకెను మళ్ళీ అధికారంలోకి తీసుకురావడానికి శ్రమిస్తున్నారు. తన సొంత నియోజకవర్గమైన ఎడప్పాడి నుండి పోటీ చేస్తూ, డీఎంకె ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను మరియు అవినీతి ఆరోపణలను ప్రధాన అస్త్రాలుగా చేసుకుని ముందుకు వెళ్తున్నారు.

వానతి శ్రీనివాసన్ (బీజేపీ)
నియోజకవర్గం: కోయంబత్తూర్ రీజియన్ కొంగునాడు (పశ్చిమ తమిళనాడు)లో బిజెపికి ఉన్న అతిపెద్ద బలం వానతి. గతంలో గెలిచిన అనుభవంతో, ఈసారి కూడా ఆ ప్రాంతంలో పార్టీని విజయపథంలో నడిపించే బాధ్యతను ఆమె భుజాన వేసుకున్నారు.

సి. జోసెఫ్ విజయ్ (టీవీకే)
నియోజకవర్గాలు: పెరంబూర్ & తిరుచిరాపల్లి ఈస్ట్ సినీ స్టార్ విజయ్ రాజకీయ రంగప్రవేశం ఈ ఎన్నికల్లో అతిపెద్ద మలుపు. తమిళగ వెట్రి కళగం (టీవీకే) స్థాపించి, ఒకేసారి రెండు చోట్ల పోటీ చేయడం విశేషం. అవినీతి నిర్మూలన, రాజకీయ సంస్కరణలే ఎజెండాగా ఆయన యువత ఓట్లను భారీగా ఆకర్షిస్తున్నారు.

ఎల్. మురుగన్ (బీజేపీ)
నియోజకవర్గం: అవినాశి కేంద్ర మంత్రి మురుగన్, బిజెపి సామాజిక పునాదిని విస్తరించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అట్టడుగు వర్గాల ఓట్లను పార్టీ వైపు తిప్పుకోవడానికి ఆయన అభ్యర్థిత్వం ఒక వ్యూహాత్మక అడుగు.

సీమాన్ (ఎన్టీకే)
పార్టీ: నామ్ తమిళర్ కట్చి తమిళ అస్తిత్వం, పర్యావరణ పరిరక్షణ అనే అంశాలపై సీమాన్ రాజీలేని పోరాటం చేస్తున్నారు. ఇప్పటివరకు పెద్దగా సీట్లు గెలవకపోయినా, ప్రతి ఎన్నికల్లో ఓట్ల శాతాన్ని పెంచుకుంటూ వస్తున్న సీమాన్, ఈసారి కూడా ప్రధాన పార్టీలకు గట్టి సవాల్‌గా మారారు.

కె. అన్నామలై (బీజేపీ)
పాత్ర: ప్రచార సారథి (పోటీలో లేరు) అన్నామలై ఈ ఎన్నికల్లో ప్రత్యక్షంగా పోటీ చేయకపోయినా, బిజెపి ప్రచారానికి ఆయనే ప్రధాన ఇంజిన్. దూకుడుగా వ్యవహరిస్తూ, డీఎంకె ప్రభుత్వాన్ని ఎండగట్టడంలో ఆయన చేస్తున్న పోరాటం తమిళ రాజకీయాల్లో పెను మార్పులకు కారణమవుతోంది.

ప్రత్యేక కథనం 4లో

టాప్ న్యూస్

## రహస్యమేమీ లేదు
- న్యాయనిపుణులతో చర్చకే ఢిల్లీకి
- తేల్చేసిన హరీష్ రావు


02

## బీఆర్ఎస్ చావును కేసీఆర్ కళ్లారా చూడాలి
- ఎంపీ అర్వింద్ సంచలన వ్యాఖ్యలు


02

## ఫ్రీ బస్సు పథకం రద్దు చేస్తామని ప్రకటించే దమ్ముందా?
- కేసీఆర్‌కు మంత్రి సీతక్క సవాల్


02



బెంగాల్ పై
## సట్టాబజార్ లెక్క ఇదే..
### హోరాహోరీ

**మహా :** సట్టా బజార్ అంచనాల ప్రకారం బెంగాల్లో టీఎంసీ, బీజేపీ మధ్య ఊహించని గట్టి పోటీ నెలకొంది. ఇందులో టీఎంసీకి 158161 సీట్లు, బీజేపీకి 127130 సీట్లు, ఐఎన్‌సీకి 46 సీట్లు వస్తాయని అంచనా వేసింది. సట్టాబజార్ ను మార్కెట్లో అత్యంత బలమైన అంచనాగా భావిస్తుంటారు. ఈ లెక్కన టీఎంసీ సాధారణ మెజారిటీని దాటుతుంది, కానీ అతి కష్టం మీద. అదే సమయంలో, రాష్ట్రంలో బీజేపీ తన చరిత్రలో నే అత్యంత బలమైన ప్రదర్శనను

మిగతా 2లో



పులివెందులలో
## వైఎస్ జగన్
నేడు 'ప్రజాదర్బార్'

**పులివెందుల,మహా:** వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మంగళవారం సాయంత్రం తన సొంత నియోజకవర్గం పులివెందులకు చేరుకున్నారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం వచ్చిన ఆయనకు కడప విమానాశ్రయం నుంచి పులివెందుల మార్గమంతటా పార్టీ శ్రేణులు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. సాయంత్రం సుమారు 4 గంటలకు భాకరాపురంలోని తన క్యాంపు కార్యాలయానికి చేరుకున్న జగన్, ఏమాత్రం

మిగతా 2లో



పిఠాపురంలో
## 'ఫ్లెక్సీ' చిచ్చు
వర్మపై జనసేన దాడి యత్నం
వర్మ వర్సెస్ దొరబాబు

**పిఠాపురం,మహా:** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజకీయాలకు కేంద్ర బిందువుగా ఉన్న పిఠాపురం నియోజకవర్గంలో తెలుగు దేశం మరియు

మిగతా 2లో

# కవిత ఇంపాక్ట్

తెలంగాణ పాలిటిక్స్‌లో..
## నయా అజెండా

- సామాజిక తెలంగాణ.. బిసి అస్త్రం.. ఉద్యమకారుల గుర్తింపు
- మహిళలు, యువతే టార్గెట్
- మమత, జయలలిత తరహాలో ప్రభావం పక్కా అంటున్న అభిమానులు
- బీఆర్ఎస్ కు ప్రధాన గండిపడే అవకాశం
- ఇప్పటికే కండువాకప్పుకున్న మాజీ ఎమ్మెల్యే బాపూరావు.. అదే బాటలో పలువురు మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు
- ఎన్నికల నాటికి పలువురు సిట్టింగ్ లు చేరే ఛాన్స్



**(హైదరాబాద్ - మహా)**

తెలంగాణ పాలిటిక్స్ పై కల్వకుంట్ల కవిత పార్టీ ప్రభావం బలంగా ఉండేలా వ్యూహాత్మక ప్రణాళిక సిద్ధం చేశారు. కేసీఆర్ నుండి పుణికిపుచ్చుకున్న మొండిపట్టుదలతోనే.. పార్టీని విజయవంతం చేసి తీరుతామని, బీఆర్ఎస్ చేసిన తప్పిదాలు చేయకుండా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పార్టీని కవిత నడిపితీరుతుందని మద్దతుదారులు ధీమాగా ఉన్నారు. గత కొద్దిరోజులుగా కవిత సెట్ చేసిన ఎజెండా, ఎంచుకున్న అంశాలు స్టేట్ పాలిటిక్స్ లో హాట్ డిస్కషన్ కు తెర తీయగా, ఇపుడు కవిత పార్టీ ఆవిర్భావానికి సమయం ఆసన్నం కావడంతో ఆసక్తి ఏర్పడింది. తెలంగాణ జాగృతి స్థాపించి.. తెలంగాణ వ్యాప్తంగా కమిటీలు, కార్యాచరణతో ఉద్యమాన్ని ఉత్తేజితం చేసిన కవిత.. ఇపుడు పొలిటికల్ పార్టీని ఏర్పాటు చేస్తున్నారు. ఏప్రిల్ 25న పార్టీ పేరు, జెండా, ఎజెండాను ప్రకటించబోతున్నారు. ఇది దాదాపుగా పసుపు, కుంకుమ రంగుల కలయికతో కవిత పార్టీ రాబోతున్నట్లు చర్చ జరుగుతోంది. ఆమె పార్టీ ఎలా ఉండబోతోంది, పార్టీ ప్రకటన సందర్భంగా ఏయే అంశాలను ప్రస్తావించబోతున్నారు.. తన పార్టీ తెలంగాణలోని ఏ పార్టీకి ప్రత్యామ్నాయం కాబోతుందనేది ఉత్కంఠ రేపుతోంది.

మిగతా 2లో

### కాంగ్రెస్, బీజేపీ నుంచి కూడా చేరికలు

అధికార కాంగ్రెస్ తో పాటు.. బీజేపీ నుంచి కూడా కవిత పార్టీలోకి చేరికలు ఉంటాయని.. ఆమె వర్గం నేతలు ప్రచారం చేస్తున్నారు. అలాగే పదవులు దక్కకపోవడంతో కాంగ్రెస్ లో అసంతృప్తితో ఉన్న నేతలపైనా కవిత దృష్టి సారించినట్లు చెప్తున్నారు. నిజానికి రాజకీయ పార్టీ ఏర్పాటు చేయాలనే నిర్ణయం తీసుకున్న తర్వాత నుంచే.. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నేతలతో కవిత సంప్రదింపులు జరుపుతూ వస్తున్నారని.. ఆమె వర్గం నేతలు అంటున్నారు. సీనియర్లతో సహా.. చాలామంది యువ నాయకులు కూడా తమ పార్టీలో చేరతారనే నమ్మకంతో కవిత ఉన్నారని తెలుస్తోంది. ఏప్రిల్ 25, ఆ తర్వాత కవిత ఇంపాక్ట్ స్పష్టం కానుంది.

### వెయ్యేళ్లయినా బీఆర్ఎస్ మారదు
- వారిని ఓడించడం ప్రజలదే తప్పా?
- 75 ఏళ్ళ కురువృద్ధుడు నవయువకుడయ్యాడా?
- కేసీఆర్ పై కల్వకుంట్ల కవిత ఫైర్
- కొత్త రాజకీయశక్తిగా వస్తున్నాం.. ఆశీర్వదించండి
- హరీష్, రేవంత్ ఇద్దరూ ఒకటే

వివరాలు 2లో

# ఆగిన బస్సు చక్రం
### ఆర్టీసీ చర్చలు విఫలం..
9,200 బస్సుల రాకపోకలు బంద్
కోటి మంది ప్రయాణికులకు ఇక్కట్లు




**హైదరాబాద్, మహా:**

రాష్ట్ర ప్రభుత్వం , ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ మధ్య సుదీర్ఘంగా జరిగిన చర్చలు ఎటువంటి కొలిక్కి రాకపోవడంతో కార్మికులు సమ్మె బాట పట్టారు. సచివాలయంలో మంగళవారం సాయంత్రం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో ఐఏఎస్ అధికారుల కమిటీతో జరిగిన చర్చలు అర్థాంతరంగా ముగిశాయి. కార్మికులు కోరుతున్న 32 డిమాండ్లపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో పాటు, సమస్యల పరిష్కారానికి మరో నాలుగు వారాల సమయం కోరడాన్ని జేఏసీ నేతలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇప్పటికే సమ్మె నోటీసు ఇచ్చి 41 రోజులు గడిచినా కాలయాపన చేయడం సమంజసం కాదని నిరసిస్తూ, బుధవారం తెల్లవారుజాము నుంచే రాష్ట్రవ్యాప్తంగా బస్సులను డిపోలకే పరిమితం చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో లక్షలాది మంది ప్రయాణికులు ఒక్కసారిగా రవాణా గండంలో చిక్కుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి నుండి సమ్మె ప్రారంభం కాగా, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

### సామాన్యులపై ప్రభావం

ఆర్టీసీ సమ్మె ప్రభావం రాష్ట్రవ్యాప్తంగా సామాన్య ప్రజల జీవనగమనంపై తీవ్ర ప్రభావం చూపనుంది. అధికారిక గణాంకాల ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ సుమారు 9,200 బస్సులు వివిధ రూట్లలో రాకపోకలు సాగిస్తుంటాయి. ముఖ్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి'

మిగతా 2లో

# అభిషేక్ సునామీ..
ఉప్పల్‌లో ఫోర్ల వాన, సిక్సర్ల తుపాను.. కోహ్లీ రికార్డు బద్దలు..
ఆరెంజ్ క్యాప్‌తో అభిషేక్ శర్మ వీరవిహారం.. ఢిల్లీపై సన్‌రైజర్స్ ఘనవిజయం



**హైదరాబాద్, మహా:** భాగ్యనగరంలోని ఉప్పల్ స్టేడియం మంగళవారం రాత్రి పరుగుల వరదలో తడిసి ముద్దయింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన పోరులో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ అభిషేక్ శర్మ 'కాటేరమ్మ కొడుకు'లా విశ్వరూపం ప్రదర్శించాడు. మైదానం నలుమూలలా ఫోర్లు, సిక్సర్ల వర్షం కురిపిస్తూ ఢిల్లీ బౌలర్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీశాడు. కేవలం 47 బంతుల్లోనే శతక్కొట్టిన అభిషేక్, అజేయంగా 135 పరుగులు చేసి సన్‌రైజర్స్‌కు కొండంత స్కోరును అందించడమే కాకుండా జట్టుకు 47 పరుగుల అద్భుత విజయాన్ని కట్టబెట్టాడు. ఈ విధ్వంసకర ఇన్నింగ్స్‌తో ఐపీఎల్ చరిత్రలో అతి తక్కువ బంతుల్లో రెండు సెంచరీలు సాధించిన తొలి భారతీయ బ్యాటర్‌గా అభిషేక్ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ బ్యాటింగ్ శైలిని చూస్తుంటే రాబోయే టి20 ప్రపంచ కప్‌లో భారత జట్టులో తన స్థానాన్ని పదిలం చేసుకున్నట్లే కనిపిస్తోంది. టాస్ గెలిచిన ఢిల్లీ ఫీల్డింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ జట్టుకు అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ మెరుపు ఆరంభాన్ని ఇచ్చారు. మొదటి బంతి నుంచే ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డ అభిషేక్ ఏ బౌలర్‌ను కూడా విడిచిపెట్టలేదు. విరాట్ కోహ్లీ 2016 సీజన్‌లో నెలకొల్పిన విధ్వంసకర వేగాన్ని తలపిస్తూ ముఖ్యంగా స్పిన్నర్లను లక్ష్యంగా చేసుకుని అభిషేక్ ఆడిన షాట్లు స్టేడియంలోని అభిమానులను మంత్రముగ్ధులను చేశాయి.

మిగతా 2లో

# అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టు
- వరంగల్ లో భారీగా హాష్ ఆయిల్ పట్టివేత
- రూ.2.50 కోట్ల విలువైన మాదకద్రవ్యాల స్వాధీనం
- నలుగురు నిందితులు అరెస్ట్ జైలుకు తరలింపు



**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీసులు మరోసారి సత్తా చాటారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు భారీ హాష్ ఆయిల్ స్మగ్లింగ్ ముఠా గుట్టురట్టు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యంత ఖరీదైన 'హాష్ ఆయిల్' గంజాయి నుంచి తీసిన నూనె తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను వరంగల్ డ్రగ్ కంట్రోల్, క్యాట్ పార్టీ, ఇంతేజార్గంజ్ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు 20 కిలోల హాష్ ఆయిల్ను స్వాధీనం చేసుకున్నారు.

మిగతా 2లో

## డీల్ కుదరకపోతే యుద్ధమే..
- ఇరాన్ కు ట్రంప్ వార్నింగ్


02

# కవిత ఇంపాక్ట్

(మొదటిపేజీ తరువాయి)

కవిత.. ఆదినుండీ బలమైన అంశాలతో తన గళాన్ని వినిపించారు. ఇపుడు సామాజిక తెలంగాణ, బీసీ అస్త్రం, ఉద్యమకారుల గుర్తింపు, యువత, మహిళలకు రాజకీయాల్లో ప్రధాన వాటా ఇచ్చేలా ఎజెండా సెట్ చేస్తున్నారు. ఒక పవర్ ఫుల్ మహిళ పార్టీ నడిపితే ఎలా ఉంటుందో.. కవిత ద్వారా తెలంగాణ ప్రజలు చూస్తారని మద్దతుదారులు అంటున్నారు. ఒక ఇందిర, మమత, జయలలిత వంటి మహానేతల పట్టుదల కవితలో చూస్తున్నామని, తెలంగాణ పాలిటిక్స్ భవిష్యత్ లో కవిత కేంద్రంగానే ఉంటాయని చెబుతున్నారు.

**కవిత పార్టీలో ఎవరెవరు చేరబోతున్నారనే ఆసక్తి..**

అడుగులు.. లక్ష్యాలు.. విధివిధానాల సంగతి ఎలా ఉన్నా.. కవిత ప్రకటించబోతున్న రాజకీయ పార్టీలో ఎవరెవరు చేరబోతున్నారనేది ఇప్పుడు రాజకీయవర్గాల్లో ఆసక్తి రేపుతోంది. తెలంగాణ ఉద్యమకారులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, మేధావులు, అన్ని రాజకీయ పార్టీల నుంచి పలువురు నేతలు .. తన పార్టీలో చేరతారని కవితతో పాటు జాగృతి కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నుంచి కూడా చాలామంది నాయకులు తనకు టచ్ లో ఉన్నారని అంటున్నారు. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్సీలతో పాటు.. బీఆర్ ఎస్ ముఖ్య నేతలు కూడా తమ పార్టీలోకి వస్తామనే సంకేతాలు పంపుతున్నారని ప్రచారం చేస్తున్నారు. ఇది తెలంగాణ రాజకీయాన్ని మరింత ఆసక్తికరంగా మారుస్తోంది. పార్టీ ఆవిర్భావానికి ముందే మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు కవిత పార్టీలో చేరగా, పలువురు మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు కవితకు టచ్ లో ఉన్నారు. కొందరు పార్టీ ఆవిర్భావం రోజు, మరికొందరు తర్వాత చేరనున్నారు. పలువురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఎన్నికల ఏడాది వస్తామని హామీనిచ్చినట్లు తెలుస్తోంది.

**బీఆర్ఎస్ నుంచి మెజారిటీ నాయకులను లాగే ప్రయత్నం**

కవిత ప్రకటించబోయే రాజకీయ పార్టీలోకి.. ఏయే పార్టీ నుంచి ఎవరెవరు వెళ్తారనే దానిపై పొలిటికల్ సర్కిల్స్ లో జోరుగా చర్చ నడుస్తోంది. తన తండ్రి పార్టీ బీఆర్ఎస్ నుంచి మెజారిటీ నాయకులను.. తనవైపు తిప్పుకొనే ప్రయత్నం కవిత చేయవచ్చనే అభిప్రాయాలు వినిపిస్తున్న వేళ.. కారు పార్టీ నుంచి ఎవరెవరు వెళ్తారనేది ఇంట్రస్టింగ్ గా మారింది. గులాబీ పార్టీలో చాలామంది నేతలతో.. కవితకు మంచి అనుబంధం ఉంది. గతంలో చాలామంది నాయకులతో ఆమె కలిసి పనిచేశారు. బీఆర్ఎస్ నుంచి తనను సస్పెండ్ చేసిన తర్వాత కూడా.. ఆ పార్టీ నేతలతో కవిత మంచి సంబంధాలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో బీఆర్ఎస్ నుంచి చాలామంది నేతలు, కార్యకర్తలు తన పార్టీలోకి వస్తారని కవిత భావిస్తున్నారని తెలుస్తోంది. పార్టీలో అసంతృప్తులు, గతంలో టికెట్ ఆశించి భంగపడిన వాళ్లను.. కవిత టార్గెట్ చేసే అవకాశాలు ఉన్నాయనేది వినబడుతోంది. తాజాగా కేసీఆర్ జగిత్యాల సభ భారీ చేరికలకు కొంత బ్రేకులు వేసినా, ఇవి ఆగే అవకాశం లేదని అంటున్నారు. బీఆర్ఎస్ వెయ్యేళ్లైనా మారదని, ప్రజలదే తప్పు అంటూ తమ తప్పులను బీఆర్ఎస్ ప్రజలమీద వేయడంపై కవిత మండిపడ్డారు.

# వెయ్యేళ్లయినా బీఆర్ఎస్ మారదు

- వారిని ఓడించడం ప్రజలదే తప్పా?
- 75 ఏళ్ళ కురువృద్ధుడు నవయువకుడయ్యాడా?
- కేసీఆర్ పై కల్వకుంట్ల కవిత ఫైర్
- కొత్త రాజకీయశక్తిగా వస్తున్నాం.. ఆశీర్వదించండి
- హరీష్, రేవంత్ ఇద్దరూ ఒకటే




**హైదరాబాద్, మహా:** రాష్ట్ర రాజకీయాల్లో మరో కీలక మలుపునకు సమయం ఆసన్నమైందని, ప్రజా సమస్యలను గాలికొదిలేసిన అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలకు ప్రత్యామ్నాయంగా ఈ నెల 25వ తేదీన ఒక నూతన రాజకీయ శక్తి ఆవిర్భవించబోతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె ఉద్వేగభరితంగా ప్రసంగించారు. వెయ్యేళ్లు గడిచినా భారత్ రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) తన తీరు మార్చుకోదని, ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోకపోగా ప్రజలనే తప్పు పట్టే స్థాయికి దిగజారడం దురదృష్టకరమని ఆమె మండిపడ్డారు. ఓటమిపై ఆత్మవిమర్శ చేసుకోవాల్సింది పోయి, ప్రజలను చులకన చేస్తూ మాట్లాడటం బీఆర్ఎస్ అహంకారానికి పరాకాష్ట అని ఆమె ధ్వజమెత్తారు. ప్రజల కోసం నిలబడే ఒక ఆడబిడ్డగా తాను ఈ నెల 25న కొత్త రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభిస్తున్నానని, ప్రజలంతా తరలివచ్చి ఆశీర్వదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. 75 ఏళ్ల కురువృద్ధుడిని పార్టీలో చేర్చుకుని, ఆయనకే 25 ఏళ్లు తగ్గిపోయాయని, ఆయనో నవ యువకుడని వర్ణించడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. మరి తెలంగాణలో ఉన్న కోట్లాది మంది నిరుద్యోగ యువత పరిస్థితి ఏమిటని ఆమె నిలదీశారు. జగిత్యాల సభ సాక్షిగా తెలంగాణ వ్యతిరేక శక్తులను అక్కున చేర్చుకోవడం ద్వారా బీఆర్ఎస్ తన పతనాన్ని తానే కొనితెచ్చుకుంటోందని ఎద్దేవా చేశారు. ముఖ్యంగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పచ్చి తెలంగాణ వ్యతిరేకి అని, ఉద్యమ కాలంలో పదవులకు రాజీనామా చేయమంటే వైఎస్ నాయకత్వమే ముద్దని అన్న వ్యక్తిని ఇప్పుడు నెత్తిన పెట్టుకోవడం ఉద్యమకారులను అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ కోసం రక్తం చిందించిన ఉద్యమకారులు నేడు భిక్షాటన చేసే స్థితికి వచ్చినా, బీఆర్ఎస్ నాయకత్వం వారి గురించి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. జాతీయ రాజకీయాల గురించి గొప్పలు చెప్పుకునే బీఆర్ఎస్, లోక్‌సభలో మహిళా బిల్లు వీగిపోయినా, డీలిమిటేషన్ మరియు జనగణనపై కేంద్రం మొండిగా వ్యవహరిస్తున్నా పల్లెత్తు మాట అనకపోవడం వెనుక ఉన్న మర్మమేమిటని కవిత ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీలో ఆడబిడ్డలకు ఎప్పుడూ గౌరవం ఉండదని, అందుకే మహిళా రిజర్వేషన్లపై వారి గొంతు పెగలడం లేదని ఆరోపించారు. ఒకవైపు బీఆర్ఎస్ 'ఉత్తి కథలు' చెబుతుంటే, మరోవైపు కాంగ్రెస్ 'పిట్టకథలు' చెబుతూ కాలక్షేపం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో పాలక, ప్రతిపక్షాలు ప్రజా సమస్యలను పక్కనపెట్టి, కేవలం బలప్రదర్శనలకే పరిమితమయ్యాయని విమర్శించారు. 'నువ్వు ఎంత అంటే.. నేను అంత' అనే చందంగా సాగుతున్న ఈ రాజకీయాలకు స్వస్తి పలకాలని, అందుకే తాము ప్రజల సమస్యల పరిష్కారమే ఎజెండాగా కొత్త రాజకీయ శక్తితో వస్తున్నామని స్పష్టం చేశారు.

**గుంటనక్క.. గుంపుమేస్త్రీ బంధం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై కూడా కవిత నిప్పులు చెరిగారు. కోర్టు తీర్పులను ప్రభావితం చేసేలా ముఖ్యమంత్రి మాట్లాడటం రాజ్యాంగ విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం కేసులో ఫలానా తీర్పు వస్తుందని ముఖ్యమంత్రి ముందే ఎలా చెబుతారని, ఇది రాజ్యాంగబద్ధ సంస్థలను తక్కువ చేయడమేనని నిలదీశారు. ఢిల్లీలో 'గుంటనక్క' ఎవరిని కలిసిందో చెప్పాలని, అసలు గుంపుమేస్త్రి సీఎంకి ఆ గుంటనక్కతో ఉన్న 'డీల్' ఏమిటో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ప్రతిపక్షం లేకుండా చేస్తానడానికి రేవంత్ రెడ్డి ఎవరని, ఎవరు ప్రతిపక్షంలో ఉండాలో నిర్ణయించేది ప్రజలని ఆమె గుర్తు చేశారు. పదేళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటానన్న ధీమా ఎక్కడిదని, ఒక్క ఉద్యోగం ఇవ్వకుండా, రైతు భరోసా పూర్తి చేయకుండా ప్రజలు మళ్ళీ ఎందుకు ఓట్లు వేస్తారని ఆమె ప్రశ్నించారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చడం, సకాలంలో రైతులకు పెట్టుబడి సాయం అందించకపోవడం వంటి చర్యలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆగ్రహానికి గురవుతోందని కవిత హెచ్చరించారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని, సంస్థను ప్రైవేటుపరం చేసే కుట్రలను అడ్డుకుంటామని ప్రకటించారు. ఆర్టీసీని తక్షణమే ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25న జరగబోయే తమ పార్టీ ఆవిర్భావ సభకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, యువత భారీగా తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు. సిరిసిల్ల నుంచి ఇప్పటికే కార్యకర్తలు పాదయాత్రగా బయలుదేరారని, వచ్చే కార్యకర్తలను ఇబ్బంది పెట్టకుండా సహకరించాలని పోలీసులను కోరారు. సమస్యలు ఉన్నచోట పోరాటమే లక్ష్యంగా తమ ప్రస్థానం సాగుతుందని ఆమె స్పష్టం చేశారు.

# అభిషేక్ సునామీ..

(మొదటిపేజీ తరువాయి)

నితీష్ రాణా వేసిన ఓవర్‌లో వరుసగా రెండు సిక్సర్లు బాది తన సెంచరీని పూర్తి చేసిన తీరు ఆరెంజ్ ఆర్మీని ఉర్రూతలూగించింది. 10 ఫోర్లు, 10 సిక్సర్లతో విరుచుకుపడిన ఈ యువ సంచలనం 68 బంతుల్లో 135 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. విరాట్ కోహ్లీ గతంలో నెలకొల్పిన స్ట్రైక్ రేట్ రికార్డులను కూడా ఈ మ్యాచ్‌తో తుడిచిపెట్టడమే కాకుండా ఒకే ఐపీఎల్ సీజన్‌లో రెండు కంటే ఎక్కువ సెంచరీలు సాధించిన అతికొద్ది మంది భారతీయ బ్యాటర్ల జాబితాలో అభిషేక్ చేరాడు.అభిషేక్ శర్మ సెంచరీ చేసిన తర్వాత తన రెండు చేతులను కట్టుకుని చేసిన 'కోల్డ్ సెలబ్రేషన్' ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ ప్రత్యేక వేడుక వెనుక ఉన్న రహస్యాన్ని మ్యాచ్ అనంతరం అతడు వెల్లడిస్తూ కోచ్ జేమ్స్ ఫ్రాంక్లిన్, మురళీధరన్ తనను 20వ ఓవర్ వరకు క్రీజులో ఉండాలని సూచించారని, ఆ మాటను నిలబెట్టుకుని చివరి వరకు బ్యాటింగ్ చేసినందుకు గుర్తుగానే అలా వేడుక చేసుకున్నట్లు తెలిపాడు. తన కెరీర్‌లో పూర్తి 20 ఓవర్లు బ్యాటింగ్ చేయడం ఇదే మొదటిసారి అని హోమ్ గ్రౌండ్‌లో ఈ ఘనత సాధించడం సంతృప్తినిచ్చిందని పేర్కొన్నాడు. ఈ ఇన్నింగ్స్ తో 323 పరుగులకు చేరుకున్న అతడు ఆరెంజ్ క్యాప్‌ను కైవసం చేసుకోవడమే కాకుండా సన్‌రైజర్స్ తరపున అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన ఆటగాడిగా రికార్డు పుటల్లోకెక్కాడు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ మొదట్లో ధాటిగానే ఆడినా హైదరాబాద్ బౌలర్ల వ్యూహాల ముందు తలవంచక తప్పలేదు. నితీష్ రాణా 57 పరుగులతో ఒంటరి పోరాటం చేసినా ఇతర బ్యాటర్లు అతనికి సహకరించలేదు. హైదరాబాద్ బౌలర్లలో ఈషన్ మలింగ తన వేగంతో మాయాజాలం చేస్తూ 4 వికెట్లు పడగొట్టగా హర్ష్ దూబే కీలకమైన 3 వికెట్లు తీసి ఢిల్లీ పతనాన్ని శాసించాడు. దిల్షాన్ మధుశంక, సాకిబ్ హుస్సేన్ కూడా కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఢిల్లీ 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 195 పరుగులకే పరిమితమైంది. వరుస విజయాలతో జోరు మీదున్న సన్‌రైజర్స్ ఈ విజయంతో పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి దూసుకెళ్లి ప్లే ఆఫ్ అవకాశాలను మరింత మెరుగుపరుచుకుంది. ఢిల్లీ బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టిన అభిషేక్ ప్రదర్శనపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

# డీల్ కుదరకపోతే యుద్ధమే..

**ఇరాన్ కు ట్రంప్ వార్నింగ్**

**వాషింగ్టన్:** ఇరాన్‌తో ఒక ఒప్పందం (డీల్) కుదరని పక్షంలో తాము యుద్ధానికి వెనుకాడబోమని, ఇందుకు అవసరమైన అత్యంత శక్తివంతమైన ఆయుధాలను ఇప్పటికే సిద్ధం చేసుకున్నామని డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. చర్చల ద్వారా శాంతియుత పరిష్కారం లభించకపోతే, ఆ తర్వాతి పరిణామాలు ఊహాతీతంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. గత కొంతకాలంగా కొనసాగుతున్న కాల్పుల విరమణ సమయాన్ని అమెరికా వృథా చేయలేదని, ఈ కాలంలోనే తమ సైనిక శక్తియుక్తులను మరింతగా కూడగట్టుకుని, యుద్ధ తంత్రాన్ని పటిష్టం చేసుకున్నామని ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌ను ఆర్థికంగా, వ్యూహాత్మకంగా దెబ్బతీయడంలో భాగంగా ఆ దేశ పోర్టులను దిగ్బంధించడం అమెరికా సాధించిన అతిపెద్ద విజయమని ట్రంప్ అభివర్ణించారు. ఈ ఆర్థిక దిగ్బంధం వల్ల ఇరాన్ ఉక్కిరిబిక్కిరి అవుతోందని, తమ వ్యూహాలు ఆశించిన ఫలితాలను ఇస్తున్నాయని ఆయన విశ్లేషించారు. అయితే, ఎటువంటి ఒప్పందం లేకుండా కాల్పుల విరమణను నిరవధికంగా కొనసాగించే ఉద్దేశం తమకు లేదని ఆయన స్పష్టం చేశారు. అమెరికా ప్రయోజనాలకు లోబడి ఉండేలా ఒక పటిష్టమైన డీల్ కుదిరితేనే శాంతి సాధ్యమవుతుందని, లేదంటే ఆయుధాలే సమాధానం చెబుతాయని ఘాటుగా వ్యాఖ్యానించారు. శాంతి, భద్రత మరియు రక్షణ అనేవి కేవలం ఒక సక్రమమైన ఒప్పందం ద్వారానే లభిస్తాయని ఆయన ఇరాన్ పాలకులకు గుర్తు చేశారు.మరోవైపు, యుద్ధ హెచ్చరికలు చేస్తున్నప్పటికీ ఇరాన్ కోసం తాము ఒక అద్భుతమైన 'డీల్' సిద్ధం చేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించడం విశేషం. ఈ ఒప్పందం ఇరాన్‌కు మాత్రమే కాకుండా, మొత్తం ప్రపంచానికే ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. యావత్ ప్రపంచమే తమ చారిత్రాత్మక ఒప్పందాన్ని చూసి గర్వపడుతుందని, అది ప్రపంచ శాంతికి బాటలు వేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఒకవైపు ఆయుధాలను చూపిస్తూనే, మరోవైపు చర్చల ఆహ్వానాన్ని పలకడం ద్వారా ట్రంప్ తన విలక్షణమైన దౌత్య నీతిని ప్రదర్శించారు. ప్రస్తుతానికి బంతి ఇరాన్ కోర్టులోనే ఉందని, వారు శాంతిని కోరుకుంటారో లేక వినాశనాన్ని ఆహ్వానిస్తారో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన మాటలు స్పష్టం చేస్తున్నాయి. ట్రంప్ చేసిన ఈ సంచలన ప్రకటనతో పశ్చిమ ఆసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకున్నట్లయింది.

# ఆగిన బస్సు చక్రం

(మొదటిపేజీ తరువాయి)

ఉచిత బస్సు ప్రయాణ పథకం కారణంగా ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగింది. సాధారణ రోజుల్లో 95 లక్షల నుంచి 97 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ సేవలపై ఆధారపడుతున్నారు. ఇప్పుడు ఒక్కసారిగా బస్సులు నిలిచిపోవడంతో వీరంతా ప్రైవేటు వాహనాలను ఆశ్రయించక తప్పని పరిస్థితి ఏర్పడింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిత్యం రాకపోకలు సాగించే 32 లక్షల మంది ఉద్యోగులు, విద్యార్థులు తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి నానా అవస్థలు పడాల్సి వస్తోంది. మరోవైపు గ్రామాల్లోని పేద ప్రజలకు ఆర్టీసీనే ఏకైక ఆధారమైన తరుణంలో, ఈ సమ్మె గ్రామీణ రవాణా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేయనుంది. ఆర్థికంగా అట్టడుగున ఉన్న టీజీఎస్ఆర్టీసీకి ఈ సమ్మె కోలుకోలేని దెబ్బ కానుంది. ఒక్క రోజు బస్సులు తిరగకపోతే సంస్థకు సుమారు 18 కోట్ల నుంచి 20 కోట్ల రూపాయల వరకు ఆదాయ గండి పడుతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. కేవలం ప్రయాణ చార్జీల రూపంలోనే కాకుండా, కార్గో సేవలు మరియు ఇతర వాణిజ్య ఆదాయం కూడా నిలిచిపోవడంతో ఆర్థిక భారం మరింత పెరగనుంది. ఇప్పటికే వేల కోట్ల అప్పుల్లో ఉన్న సంస్థకు, ఈ సమ్మె కారణంగా వచ్చే నష్టాలను పూడ్చుకోవడం పెను సవాలుగా మారనుంది. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ , ఆర్టీసీని ప్రభుత్వంలో పూర్తిస్థాయిలో విలీనం చేయడం వంటి డిమాండ్లపై కార్మికులు పట్టుబడుతున్నారు. ప్రభుత్వం జాప్యం చేస్తున్న కొద్దీ ఈ నష్టం మరింత పెరిగే అవకాశం ఉందని, ఇది చివరకు సంస్థ మనుగడకే ప్రమాదకరంగా మారుతుందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ప్రత్యామ్నాయాలపై సర్కారు దృష్టి

కార్మిక నేతలు ఈసారి సమ్మెను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. 2011 నాటి సకల జనుల సమ్మెను తలపించేలా రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని నిర్మిస్తామని జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న హెచ్చరించారు. ఔట్ సోర్సింగ్ సిబ్బందితో పాటు డ్రైవర్లు, కండక్టర్లు మరియు మెకానిక్ విభాగం వారు కూడా విధులను బహిష్కరించడంతో డిపోలన్నీ బోసిపోయి కనిపిస్తున్నాయి. అటు ప్రభుత్వం కూడా వెనక్కి తగ్గకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించింది. ప్రైవేటు డ్రైవర్లతో బస్సులు నడపాలని, స్కూలు బస్సులు మరియు ప్రైవేటు ట్రావెల్స్ వాహనాలను వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించింది. అయితే సుమారు 3,600 పైగా రూట్లలో నిత్యం నడిచే భారీ నెట్‌వర్క్‌ను ప్రైవేటు సిబ్బందితో భర్తీ చేయడం అసాధ్యమని స్పష్టమవుతోంది. ఈ ఉద్రిక్త పరిస్థితుల మధ్య సామాన్య ప్రయాణికుడు బలికాక తప్పని పరిస్థితి నెలకొంది. ఈ సమ్మె కేవలం రవాణా సమస్యే కాకుండా రాజకీయంగా కూడా వేడి పుట్టిస్తోంది. ప్రభుత్వం మరియు కార్మికుల మధ్య నెలకొన్న ఈ ప్రతిష్టంభన ఎప్పటికి తొలగుతుందనేది ఇప్పుడు అటు పాలక వర్గాల్లోనూ, ఇటు ప్రజల్లోనూ చర్చనీయాంశంగా మారింది. ప్రైవేటు ఆటోలు, ట్యాక్సీల యజమానులు ఇదే అదనుగా ప్రయాణికుల నుంచి రెట్టింపు చార్జీలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిత్యావసర వస్తువుల రవాణాపై కూడా ఈ ప్రభావం పడటంతో ధరలు పెరిగే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఏది ఏమైనా, చర్చల ద్వారా సమస్య పరిష్కారం కాకపోవడం రాష్ట్ర ప్రజలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తోంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మిక సంఘాలతో మరోసారి చర్చలు జరిపి, రవాణా చక్రం మళ్ళీ సాఫీగా సాగేలా చూడాలని సామాన్యులు కోరుకుంటున్నారు.

# అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టు

(మొదటిపేజీ తరువాయి)

దీని అంతర్జాతీయ మార్కెట్ విలువ సుమారు రూ. 2.50 కోట్లు ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. ఈ కేసు పూర్తి వివరాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ వెల్లడించారు.

**అరెస్టు అయిన వారి వివరాలు**

ఒడిషా రాష్ట్రం మల్కాన్గిరి జిల్లాకు చెందిన హంటల్ సన్ను (23), హంటల్ సన్యాసి (23), కృష్ణా హంటల్ (56)లతో పాటు ఏపీలోని అల్లూరి జిల్లాకు చెందిన కండెల చిన్నబాబు (56) ఉన్నారు. మరో నిందితుడు కిలో పాండు ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ప్రధాన నిందితుడు హంటల్ సన్ను తన స్వగ్రామంలోనే గంజాయి సాగు చేస్తూ, దాని ద్వారా వచ్చే ఆదాయంతో జల్సాలు చేసేవాడు. కాగా గంజాయి అమ్మడం కంటే దాని నుంచి తీసే హాష్ ఆయిల్ కు మార్కెట్లో ఎక్కువ డిమాండ్ ఉండటంతో, నిందితుడు పాండు సూచన మేరకు గంజాయి మొక్కల నుండి ఆయిల్ సేకరించడం ప్రారంభించారు. ఓ ప్రత్యేక పరికరం ద్వారా 40 కిలోల హాష్ ఆయిల్ను సేకరించగా, అందులో 20 కిలోలను పాండు తీసుకున్నాడు. మిగతా 20 కిలోలను ఒక్కో కిలో ప్యాకెట్ల చొప్పున ప్యాక్ చేసి ముంబైలో విక్రయించేందుకు నిందితులు ప్లాన్ చేశారు. ఈ నెల 19న తుని రైల్వే స్టేషన్ నుండి కోనార్క్ ఎక్స్‌ప్రెస్లో నిందితులు ముంబై బయలుదేరారు. అయితే వరంగల్ స్టేషన్లో తనిఖీలు జరుగుతున్నాయనే అనుమానంతో ఇక్కడే దిగిపోయారు. మంగళవారం ఉదయం వరంగల్ బస్టాండ్ సమీపంలోని రైల్వే గూడ్స్ షెడ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్నారనే పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల్లో వారి వద్ద ఉన్న 20 కిలోల హాష్ ఆయిల్ బయటపడింది. భారీ స్థాయిలో డ్రగ్స్ పట్టుకున్న సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, ఏఎస్పీ శుభం, ఏసీపీలు జితేందర్ రెడ్డి, జానీ నర్సింహులు, ఇన్స్ స్పెక్టర్లు సతీష్, షూకూర్, ఎస్ఐలు సందీప్, తేజ, ఆర్ఎస్ఐ లు ఏ.పూర్ణ చందర్ రెడ్డి, కె. మనోజ్ రెడ్డి, ఎల్.లింగారావు, క్యాట్ పార్టీ ఏఆర్ ఏఎస్ఐలు వి.సుబ్బిరామి రెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు బాల రాజు, కె.శ్రీరాములు, యం.డి రబ్బానీ, ఆర్.రాజ్కుమార్తో పాటు ఇంతేజార్గంజ్ సిబ్బందిని సీపీ ప్రత్యేకంగా అభినందించారు. గంజాయి, డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పోలీసులకు సహకరించాలని సీపీ కోరారు.

# బెంగాల్ పై సట్టాబజార్ లెక్క ఇదే

(మొదటిపేజీ తరువాయి)

కనబరుస్తుందని అంచనా. బీజేపీ గరిష్ట అంచనాకు, టీఎంసీ కనిష్ట అంచనాకు మధ్య అంతరం కేవలం 28 సీట్లే ఉండటం, తుది ఫలితంపై నెలకొన్న తీవ్రమైన ఉత్కంఠకు అద్దం పడుతోంది. పశ్చిమబెంగాల్లో ఈసారి తృణమూల్ కాంగ్రెస్ పై ఉన్న వ్యతిరేకతకు తోడు భారీ ఎత్తున ఈసీ తొలగించిన ఓట్ల ప్రభావం కూడా ఎన్నికలపై పడుతోంది. దీంతో బీజేపీ భారీ ప్రయోజనం పొందుతున్నట్లు తెలుస్తోంది. అలాగే బీజేపీ బంగ్లాదేశ్ వలసలపై చేస్తున్న ప్రచారం ప్రభావం కూడా ఎన్నికల్లో కనిపిస్తోంది. అయినా మమత సర్కార్ పకడ్బందీగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రభావంతో నాలుగోసారి కూడా విజయం సాధించే అవకాశాలు ఉన్నట్లు అర్థమవుతోంది. బెంగాల్లో గురువారం తొలి దశ ఎన్నికలు జరగనుండగా.. ఈ నెల 29న రెండో దశ ఎన్నికలు జరుగుతాయి.

# బీఆర్ఎస్ చావును కేసీఆర్ కళ్లారా చూడాలి

**ఎంపీ అర్వింద్ సంచలన వ్యాఖ్యలు**

**హైదరాబాద్, మహా:** కేసీఆర్, రేవంత్ లు.. వీరిద్దరికీ లాగుల మీదే ప్రేమ. ఒకాయన లాగుల్లో తొండలు విడుస్తా అంటాడు.. మరొకాయన లాగులు పగిలే దాకా కొట్టాలంటాడు' అని బిజెపి ఎంపీ ధర్మపురి అర్వింద్ సెటైర్స్ వేశారు. కేసీఆర్ చనిపోవాలని ఎవరూ కోరుకోవడం లేదని, ప్రపంచస్థాయిలో ట్రంప్, రాష్ట్రస్థాయిలో కేసీఆర్ వల్లే మంచి ఎంటర్టైన్‌మెంట్ ఉందన్నారు. ఆయన వందేళ్లు బతకాలని, బీఆర్ఎస్ చావును కేసీఆర్ కళ్ళారా చూడాలని అన్నారు. జగిత్యాల సభలో కేసీఆర్ పచ్చి అబద్ధాలు ఆడారని అర్వింద్ విమర్శించారు. కేసీఆర్‌ను కేటీఆర్, కవితలే ఎక్కువగా హింసిస్తున్నారని అర్వింద్ ఆరోపించారు. కవిత, కేటీఆర్‌లకు ఫ్లైట్ టికెట్ ఇచ్చి పంపిస్తే కేసీఆర్ దరిద్రంతో పాటు తెలంగాణ దరిద్రం కూడా వదులుతుంది అంటూ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

# పిఠాపురంలో 'ఫ్లెక్సీ' చిచ్చు

**వర్మపై జనసేన దాడి యత్నం.. వర్మ వర్సెస్ దొరబాబు**

(మొదటిపేజీ తరువాయి)

జనసేన శ్రేణుల మధ్య నెలకొన్న అంతర్గత విభేదాలు మంగళవారం మరోసారి వీధిన పడ్డాయి. అధికారిక కార్యక్రమంలో ప్రోటోకాల్ వివాదం కాస్తా వ్యక్తిగత దూషణలకు, పరస్పర విమర్శలకు దారితీసి నియోజకవర్గంలో హైటెన్షన్ వాతావరణాన్ని సృష్టించింది. పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం వేదికగా జరిగిన ఒక ప్రభుత్వ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫోటో లేకపోవడం ఈ వివాదానికి ప్రధాన కారణమైంది. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్వీఎస్ఎన్ వర్మ మరియు జనసేన నేత పెండెం దొరబాబు మధ్య జరిగిన వాగ్వాదం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ చర్చకు దారితీసింది. వివరాల్లోకి వెళితే, మంగళవారం పీఏడీఏ కార్యాలయ ప్రాంగణంలో 'పీఎం అనుసూచిత్ జాతి అభ్యుదయ యోజన' కార్యక్రమాన్ని నిర్వహించారు. అయితే, ఈ కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బ్యానర్‌పై ప్రధాని మోదీ మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫోటోలు ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోటో లేకపోవడంపై ఎస్వీఎస్ఎన్ వర్మ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది ప్రభుత్వ కార్యక్రమమని, అందులో ముఖ్యమంత్రి ఫోటో లేకపోవడం ఏంటని అధికారులను ఆయన నిలదీశారు. దీనిపై పీఏడీఏ అధికారులు క్షమాపణలు చెప్పడంతో వివాదం సద్దుమణుగుతుందనుకున్న తరుణంలో, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు అక్కడికి చేరుకోవడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది.వర్మ వద్దకు వచ్చిన పెండెం దొరబాబు.. మీరు కూటమిలో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారంటూ మండిపడ్డారు. పదేపదే ఫోటోల పేరుతో రచ్చ చేయడం సరికాదని ఆయన వ్యాఖ్యానించడంతో ఇద్దరు నేతల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో వర్మ మరింత ఘాటుగా స్పందిస్తూ, 2024 ఎన్నికల్లో పవన్ కల్యాణ్ ఓటమి కోసం పనిచేసిన దొరబాబు, ఇప్పుడు కేవలం తనకున్న రూ.150 కోట్ల ఆర్థిక అక్రమాల కేసుల నుండి తప్పించుకోవడానికే జనసేనలో చేరారని తీవ్ర ఆరోపణలు చేశారు. పిఠాపురంలో తెలుగుదేశం పార్టీ కేడర్‌ను జనసేన నాయకులు కావాలనే విస్మరిస్తున్నారని, కూటమి ధర్మాన్ని పాటించడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరు నేతలు ఒకరిపై ఒకరు వేలు చూపిస్తూ దూషణలకు దిగడంతో పీఏడీఏ కార్యాలయం వద్ద భారీగా మోహరించిన కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది.గత కొద్దికాలంగా పిఠాపురం నియోజకవర్గంలో ఫ్లెక్సీల విషయంలో తమ్ముళ్లు, సైనికుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా పరిస్థితి ఉంది. డిప్యూటీ సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో ఇక్కడ ప్రతి చిన్న విషయం కూడా చర్చనీయాంశంగా మారుతోంది. గతంలో కూడా శిక్షణ శిబిరాల వద్ద చంద్రబాబు ఫోటోలు స్టాంప్ సైజులో వేశారని వర్మ ఆగ్రహం వ్యక్తం చేసిన ఘటనలు ఉన్నాయి. తాజాగా జరిగిన ఈ బాహాబాహి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో, కూటమి పార్టీల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చినప్పటికీ, పిఠాపురంలో ఈ ఇద్దరు నేతల మధ్య నెలకొన్న వైరం రాబోయే రోజుల్లో ఎలాంటి మలుపులు తిరుగుతుందోనని స్థానిక ప్రజలు ఉత్కంఠగా గమనిస్తున్నారు.

# ఫ్రీ బస్సు పథకం రద్దు చేస్తామని ప్రకటించే దమ్ముందా?

**కేసీఆర్‌కు మంత్రి సీతక్క సవాల్**

**హైదరాబాద్, మహా:** ఫ్రీ బస్ పథకాన్ని పనికిమాలినదిగా అభివర్ణించడం దొరతనానికి నిదర్శనమని, వెంటనే ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. ఉచిత బస్ ప్రయాణ పథకంపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను మంత్రి సీతక్క తీవ్రంగా ఖండించారు. ఆయన వ్యాఖ్యలు మహిళల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని, మహిళా లోకానికి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు అన్నారు. నిజంగా ఈ పథకం పనికిరాదని భావిస్తే, దాన్ని రద్దు చేస్తామని చెప్పే ధైర్యం ఉందా సూటి ప్రశ్న వేశారు. ఈ ఉచిత బస్ పథకం ద్వారా లక్షలాది మహిళలు ప్రతి రోజు ప్రయాణ ఖర్చులను ఆదా చేసుకుంటూ, ఉద్యోగాలు, విద్య, ఆరోగ్య సేవలు సులభంగా పొందుతున్నారని ఆమె వివరించారు. ఇప్పటివరకు సుమారు రూ.10 వేల కోట్ల మేర మహిళలకు ప్రయాణ వ్యయభారం తగ్గిందని తెలిపారు. ఇది కేవలం పథకం మాత్రమే కాదు, మహిళల ఆర్థిక స్వావలంబనకు, సామాజిక స్వేచ్ఛకు దారితీసే కీలక అడుగు అని స్పష్టం చేశారు.

# పులివెందులలో వైఎస్ జగన్

**నేడు 'ప్రజాదర్బార్'**

(మొదటిపేజీ తరువాయి)

ఆలస్యం చేయకుండా 'ప్రజాదర్బార్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. తనను కలిసేందుకు నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజలు, వికలాంగులు మరియు వృద్ధుల సమస్యలను ఆయన ఓపికగా ఆలకించారు. రాత్రి 7 గంటల వరకు సాగిన ఈ ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వందలాది అర్జీలను స్వీకరించిన జగన్, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. రాత్రికి అక్కడి తన నివాసంలోనే ఆయన బస చేస్తారు. పర్యటనలో భాగంగా రెండో రోజైన బుధవారం వైఎస్ జగన్ లింగాల మండలంలో పర్యటించనున్నారు. రెండో విడత ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు మరియు అధికార పార్టీ విమర్శల నేపథ్యంలో, క్షేత్రస్థాయిలో క్యాడర్‌ను సమాయత్తం చేయడంతో పాటు ప్రజలతో నేరుగా మమేకమవ్వడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశ్యమని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# రహస్యమేమీ లేదు

**న్యాయనిపుణులతో చర్చకే ఢిల్లీకి.. తేల్చేసిన హరీష్ రావు**

**హైదరాబాద్, మహా:** రహస్య భేటీలు చేయడం నాకు అలవాటు లేదు. రాత్రి రాహుల్ గాంధీని కలిసి, ఉదయం కేంద్ర మంత్రులను, బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలను కలవడం రేవంత్ రెడ్డికే వెన్నతో పెట్టిన విద్య" అని మాజీమంత్రి హరీష్ రావు హాట్ కామెంట్స్ చేశారు. పనిలేని వారే తన పర్యటనలపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తన ఢిల్లీ పర్యటనపై సీఎంవో నుంచి వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. నిన్నటి జగిత్యాల సభలో కేసీఆర్ తెలంగాణ ప్రయోజనాల గురించి అత్యంత హుందాగా మాట్లాడారని హరీష్ రావు పేర్కొన్నారు. జగిత్యాల, కాటారం సభలతో ప్రజలకు ఒక విషయం స్పష్టమైంది. తెలంగాణ కోసం తపించే కేసీఆర్ ఎవరో, చిల్లర మాటలు మాట్లాడే రేవంత్ రెడ్డి ఎవరో అందరికీ తెలిసిపోయింది అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో నూటికి నూరు శాతం రాష్ట్రంలో మళ్ళీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తన ఢిల్లీ పర్యటనపై సీఎంవో ఇచ్చిన లీకులను హరీష్ రావు కొట్టిపారేశారు. నా ఢిల్లీ పర్యటనలో ఎలాంటి రహస్యం లేదు.



ఫిరాయింపుల కేసుపై న్యాయ నిపుణులతో చర్చించేందుకే ఢిల్లీకి వచ్చాను. అందరి కళ్లముందే శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి విమానం ఎక్కాను తప్ప దొంగచాటుగా వెళ్లలేదు అని స్పష్టం చేశారు. రేపు సుప్రీంకోర్టులో 'ఓటుకు నోటు' కేసు విచారణ ఉందని, అందులో బీఆర్ఎస్ ఇంప్లీడ్ అయిందన్నారు.

# బూర్గంపహాడ్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ...

### రైతులకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా ధాన్యం కొనుగోలు నిర్వహించాలి .. జిల్లా కలెక్టర్ అంకిత్



**బూర్గంపహాడ్ మహా :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సంక్షేమ వారంలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ అంకిత్ బూర్గంపహాడ్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు,విద్యా కార్యక్రమాల అమలు,పాఠశాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు పాఠశాలలో నిర్వహిస్తున్న టాలెంట్ టెస్ట్, డ్రాయింగ్ పోటీలను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని , మరింత విస్తృతంగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడి వసతి, భోజనం, పాఠ్యపుస్తకాలు తదితర సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అన్ని సదుపాయాలు సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల కిచెన్ షెడ్‌ను పరిశీలించి, మెనూ ప్రకారం పోషకాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. తాజా కూరగాయల వినియోగం, ఆహార తయారీ, వడ్డింపులో పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. అలాగే పాఠశాల పరిసరాల పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలపై కూడా ఆరా తీశారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం అత్యంత అవసరమని తెలిపారు. అనంతరం బూర్గంపహాడ్ వ్యవసాయ కమిటీ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యాన్ని పరిశీలించి, మాయిశ్చర్ మీటర్ ద్వారా తేమ శాతాన్ని తనిఖీ చేశారు. ధాన్యం నాణ్యత ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియ పురోగతి, పెండింగ్ ధాన్యం వివరాలు తెలుసుకుని, సన్న మరియు దొడ్డు రకం ధాన్యాల కొనుగోలుకు వేర్వేరు ఏర్పాట్లు చేయాలని సూచించారు. రైతులతో మాట్లాడి వారికి ఎదురవుతున్న సమస్యలను తెలుసుకుని, లైటింగ్, తాగునీటి వంటి మౌలిక సదుపాయాలు తక్షణమే కల్పించాలని అధికారులను ఆదేశించారు. పి.ఆర్-126 దొడ్డు రకం ధాన్యం నాణ్యతపై రైతులు వ్యక్తం చేసిన సందేహాలపై వ్యవసాయ శాఖ అధికారులతో చర్చించి, పిన్‌పాయింట్ డ్యామేజ్ సమస్యపై పూర్తి వివరాలు సేకరించి ఉన్నతాధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యత ప్రమాణాల విషయంలో స్పష్టత తీసుకువచ్చి రైతులకు నష్టం కలగకుండా చూడాలని తెలిపారు ప్రతి రైతు వద్ద ఉన్న చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని, ఎవరూ నష్టపోకుండా కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కొనుగోలు రిజిస్టర్, రసీదు పుస్తకాలను పరిశీలించి నమోదు విధానాన్ని సమీక్షించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ ప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, ఎంపీడీవో జమలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మీయ భరోసా అమలు చేయాల్సిందే..

- వీబీజీ రాంజీతో పనికి దూరమవుతున్న పేదలు
- ఉపాధి పని ప్రదేశాలలో వ్యకాస సర్వే



**కారేపల్లి, మహా:** భూమిలేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అంటూ ఆశ చూపిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు భరోసా కల్పించడం లేదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు విమర్శించారు. మంగళవారం సింగరేణి మండలంలో ఉపాధి పని నిర్వహిస్తున్న ప్రదేశాలలో వ్యకాస సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా వ్యకాస నేత కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ జాబ్‌కార్డులు కలిగి భూమిలేని 22లక్షల మంది వ్యవసాయ కూలీలకు ఆత్మీయ భరోసా అమలు చేస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు నాటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన ఏడాదికి అరకొరగా అమలు చేశారని విమర్శించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన వీబీజీ రాంజీ తో పేదలు ఉపాధి దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్ లో ప్రతి సారీ నిధులు తగ్గించుకుంటూ వస్తుందని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు పరచి, విబిజీరాంజీ బిల్లుగా మార్పు చేసి కేంద్రం 60%నిధులు విడుదల చేసి మిగిలిన 40% నిధులు రాష్ట్ర ప్రభుత్వం భరాయించాలని చెప్పటం సరి కాదన్నారు.

యూపీఏ1 ప్రభుత్వం 2005లో చేసిన చట్టాన్ని యధార్థంగా కొనసాగించాలని ఆయన. డిమాండ్ చేశారు. ఎండల వేడి తీవ్రతతో ఉపాధి కూలీలు ఇబ్బంది పడుతున్నారని, పని ప్రదేశంలో రెండుసార్లు ఫోటో పద్ధతిని ఎత్తివేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న ఉపాధి కూలీల బిల్లులను వెంటనే విడుదల చేయాలని, పని ప్రదేశంలో టెంటు, మంచినీళ్లు మెడికల్ కిట్టు తదితర వసతులు కలిపించాలన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధి హామీ పని ప్రదేశాల్లో చేపట్టిన సర్వేలో వెలుగులోకి వచ్చిన సమస్యలనీ పరిష్కారానికి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆయన తెలిపారు. ఈ సర్వే కార్యక్రమంలో వ్యకాస మండల అధ్యక్ష కార్యదర్శులు యనమనగండ్ల రవి, కేసగాని ఉపేందర్నా, నాయకులు పాసిని నాగేశ్వరరావు, చల్లా మల్లమ్మ, షేక్ సైదులు, కరపటి అరుణ, మద్దెల నాగయ్య, అన్నారపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సారపాకలో ఆదిశంకరాచార్య జయంతి వేడుకలు – మజ్జిగ పంపిణీ




**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపాడు మండలం సారపాకలోని సాకేతపురి నాలుగు రోడ్ల కూడలిలో మంగళవారం జగద్గురువు ఆది శంకరాచార్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాకేతపురి బ్రాహ్మణ సమైక్య అధ్యక్షుడు వెల్ది మోహన్ శర్మ, కార్యదర్శి డి. సాయి కిరణ్ శర్మ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు ఆదిశంకరాచార్యుల జీవితంలోని ముఖ్య ఘట్టాలను వివరించారు. శివుడు, కేశవుడు మధ్య ఎలాంటి భేదాలు లేవని, దేవుని దృష్టిలో అందరూ సమానమని, సమాజంలో కులభేదాలు ఉండకూడదని సందేశం ఇచ్చారు.అనంతరం వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని చల్లని మజ్జిగ, మంచినీళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించిన ఈ సేవా కార్యక్రమంలో సుమారు 300 మందికి దాహార్తి తీర్చారు.ఈ కార్యక్రమాన్ని సాకేతపురి వర్తక సంఘం, బ్రాహ్మణ సమూహం, హిందూ ఐక్యవేదిక, ఆంజనేయస్వామి సేవా సంఘం, ధర్మ జాగరణ సమితి సంయుక్తంగా నిర్వహించాయి.కార్యక్రమంలో ఎం.వి. సుబ్రహ్మణ్యం, గోపి కిషోర్, తిప్పల నాగేంద్ర రెడ్డి, అయ్యప్ప, సంజయ్, వి. రామారావు, సిలివేరు శ్రీనివాసరావు స్వామి తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాలకు త్రాగునీరు కల్పించాలి..

### ఎమ్మెల్యే పాయం, ఐటీడీఏ పీవోలకు ఐఎఫ్ టియు వినతి..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలో గొంతెండుతున్న ఆదివాసి, గిరిజన గ్రామాలకు తక్షణం రక్షిత త్రాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ ఐఎఫ్టీయూ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్, ఐఏఎస్ లకు వినతి పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే స్వగృహంలో, అలాగే ఐటీడీఏ కార్యాలయంలో ఈ వినతి పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు యస్.డి నాసర్ పాషా మాట్లాడుతూ పినపాక నియోజకవర్గంలోని మణుగూరు, అశ్వాపురం, పినపాక మండలాల పరిధిలోని అనేక గిరిజన గ్రామాల్లో రక్షిత త్రాగునీటి సౌకర్యం లేక ప్రజలు చెరువులు, కుంటలు, చెలమలలో పరిశుభ్రత లేని నీటిని వినియోగించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ముఖ్యంగా మణుగూరు మండలం రామానుజవరం పంచాయతీ పరిధిలోని పెద్దిపల్లి, పగిడేరు సమీపంలోని విప్పలగుంపు, ఖమ్మం తోగు వద్ద బుడుగుల, కూనవరం పంచాయతీ పరిధిలో సర్వాయిగుంపు, రేగులగండి గ్రామాలు తీవ్ర త్రాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. అలాగే అశ్వాపురం మండలం కుమ్మరిగుంపు, మనుబోతుల గూడెం, పినపాక మండలం పిట్టతోగు సహా ఇతర గిరిజన గ్రామాల్లో కూడా శాశ్వత త్రాగునీటి పథకాలు అమలు చేయాలని, అప్పటివరకు పంచాయతీల ద్వారా ట్యాంకర్లతో త్రాగునీటి సరఫరా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మణుగూరు రైల్వే స్టేషన్ నుంచి రాయన్నపేట వరకు రహదారి నిర్మాణానికి ఐటీడీఏ ద్వారా మంజూరైన రూ.30 లక్షల నిధుల పనులు ప్రారంభం కాలేదని, వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన గ్రామాల్లో విద్యుత్, రహదారి వంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం, సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బూర్గంపాడు మండలం కృష్ణసాగర్ పంచాయతీ పరిధిలోని చింతలక్ష్మీనగర్ గ్రామానికి తాగునీటి బోరు ఏర్పాటు చేయాలని కూడా కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు బి జగన్మోహన్ రెడ్డి, కిరణ్ కుమార్, అంగోత్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఐటిసి పీఎస్పీడీ కర్మాగారంలో ఘోర ప్రమాదం – డ్రైవర్ మృతి



**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ITC Limited PSPD కర్మాగారంలో మంగళవారం విషాద ఘటన చోటుచేసుకుంది. ఫ్యాక్టరీ పరిధిలో ఉన్న ఫైర్ పైప్‌లైన్‌ను లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. ప్రమాదంలో లారీ డ్రైవర్ తంబీ మెడ వద్ద తీవ్ర గాయాలతో కుప్పకూలిపోయాడు. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించినప్పటికీ మార్గమధ్యలోనే మృతి చెందినట్లు సమాచారం అందింది. డ్రైవర్ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు మరియు ముసలిమడుగు గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐటిసి గేటు వద్ద ధర్నాకు దిగిన గ్రామస్తులు “మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి” అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. దీంతో కర్మాగారం ముందు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు, సంబంధిత అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు చర్యలు చేపట్టారు. ఘటనపై విచారణ ప్రారంభించి ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు ""“బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి” అంటూ గ్రామస్తుల ఆగ్రహం వ్యక్తం చేశారు . కర్మాగారంలో మంగళవారం విషాద ఘటన చోటుచేసుకుంది. ఫ్యాక్టరీ పరిధిలో ఉన్న ఫైర్ పైప్‌లైన్‌ను లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది.ప్రమాదంలో లారీ డ్రైవర్ తంబీ మెడ వద్ద తీవ్ర గాయాలతో కుప్పకూలిపోయాడు. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించినప్పటికీ మార్గమధ్యలోనే మృతి చెందినట్లు సమాచారం అందింది.డ్రైవర్ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు మరియు ముసలిమడుగు గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐటిసి గేటు వద్ద ధర్నాకు దిగిన గ్రామస్తులు “మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి” అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. దీంతో కర్మాగారం ముందు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు, సంబంధిత అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు చర్యలు చేపట్టారు. ఘటనపై విచారణ ప్రారంభించి ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు.

## ఐటీసీ యాజమాన్యాన్ని వివరణ కోరిన జాయింట్ కమిషనర్ వరంగల్

**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపహాడ్ మండలం సారపాక ఐటీసీ కర్మాగారంలో జరుగుతున్న 14వ వేతన ఒప్పందం జాప్యం పై ఐఎన్టీయూసీ మిత్రపక్షల ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ నాడు జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వరంగల్ (JCL) కార్యాలయంలో సూపరడెంట్ గౌతమి గారికి వినతి పత్రాన్ని అందజేసిన విషయంపై JCL వారు మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వవలసిందిగా యాజమాన్యాన్ని కోరడం జరిగింది దానికి సంబంధించిన పత్రాన్ని యాజమాన్యంతో పాటు ఐఎన్టీయూసీ మిత్రపక్షాల వారికి కూడా జేసిఎల్ వారు పత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగాఐఎన్టీయూసీ మిత్రపక్షాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోనె రామారావు.యారం పిచ్చిరెడ్డి మాట్లాడుతూమా పరిశ్రమలో కార్మికుల విషయంలో గుర్తింపు సంఘం మరియు యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి కార్మికుల హక్కులకు పై భంగం కలుగుతున్నందున JCL వరంగల్ వారు జోక్యం చేసుకొని యాజమాన్యానికి వివరణ కోరినందున ఐఎన్టీయూసీ మిత్రపక్షాల తరపున JCL వరంగల్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాం సమస్యలని త్వరలోనే పరిష్కరిస్తారని ఆశిస్తున్నామన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** జిల్లాలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తహసీల్దారులు ఎంపీడీవోలు ఏటీఎంలు సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా ధాన్యం కొనుగోలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సుమారు 83,635 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని మొత్తం 168 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోళ్లు చేపట్టేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 56కొనుగోలు కేంద్రాలకు ధాన్యం చేరిందని ముఖ్యంగా ములకలపల్లి అన్నపురెడ్డిపల్లి ప్రాంతాల్లో అధికంగా ధాన్యం వచ్చినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు ధాన్యం గ్రేడింగ్ ప్రక్రియను సక్రమంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. రైస్ మిల్లర్ల నుండి ప్రభుత్వ నిబంధనల ప్రకారం బ్యాంక్ గ్యారంటీలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని టెంట్లు తాగునీరు విద్యుత్ వసతి కల్పించడంతో పాటు టార్పాలిన్లు ప్యాడీ క్లీనర్లు తూకం యంత్రాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలని కూలీలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులు తమ కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారానే విక్రయించాలని పిలుపునిచ్చారు. ధాన్యాన్ని తాలు తడి లేకుండా శుభ్రంగా కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు.కొనుగోలు కేంద్రాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ మిల్లుల కేటాయింపులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## కెసిఎస్‌పీలో సేల్ పికింగ్ టెండర్ పై అనిశ్చితి..

- భూ నిర్వాసితులకు ఉపాధి భద్రత కల్పించాలి..
- ఐఎఫ్‌టీయూ డిమాండ్..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సింగరేణి కాలర్స్ మణుగూరు ఏరియా కొండాపురం సిఎస్‌పీలో కొనసాగుతున్న సేల్ పికింగ్ టెండర్‌ను వెంటనే కొనసాగించాలని, భూ నిర్వాసితులు, స్థానికులకు ఉపాధి భద్రత కల్పించాలని ఐఎఫ్టీయూ ఆధ్వర్యంలో కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కెసీఎస్పీ డీజీఎం ఆర్ఎస్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.డి నాసర్ పాషా మాట్లాడుతూ, కొండాపురం సిఎస్‌పీలో సేల్ పికింగ్ టెండర్ కాంట్రాక్ట్ పనుల ద్వారా సింగరేణి భూ నిర్వాసితులు, స్థానికులు తమ జీవనోపాధిని కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఈ టెండర్ కొనసాగింపు పై స్పష్టత లేకపోవడం వల్ల కార్మికుల్లో ఆందోళన నెలకొన్నదన్నారు. సివిల్ లేదా నాన్‌సివిల్ టెండర్‌గా ఎలా కొనసాగించాలన్న విషయంలో అనిశ్చితి నెలకొని ఉందని, ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. టెండర్ కొనసాగింపులో ఆలస్యం జరిగితే భూ నిర్వాసితులు, స్థానిక కార్మికులు తీవ్రంగా నష్టపోతారని, వెంటనే నిర్ణయం తీసుకుని పనులను నిరవధికంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకుడు సంజీవ్, కాంట్రాక్ట్ కార్మికులు బి నరేష్, ఎం రాజేష్, బి రాములు, వై ఇమ్మానుయేల్, బి తరుణ్, వై బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రథమ ర్యాంకర్ విజయభానును సన్మానించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య..



**తల్లాడ, మహా :** పదో తరగతి సీబీఎస్సీ ఫలితాల్లో ఖమ్మంజిల్లా ప్రథమ స్థానం, ఆల్ ఇండియా ఐదవ స్థానాన్ని దక్కించుకున్న తల్లాడ మండలం నారాయణపురం గ్రామానికి చెందిన రెడ్డెం విజయభానును సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య సన్మానించారు. మంగళవారం తల్లాడ మండలంలో ఆయన పర్యటించారు. ఈ విషయం తెలుసుకున్న సండ్ర ఆ విద్యార్థిని ఇంటికి వెళ్లి ఆమెకు స్వీట్ తినిపించి, శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆమెను ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. తల్లిదండ్రులు రెడ్డెం నారాయణరెడ్డి, అరుణకుమారి దంపతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షులు రెడ్డెం వీర మోహన్ రెడ్డి, మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి, నాయకులు దుగ్గిదేవర వెంకట లాల్, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## డివైండర్ ఢీకొని... నలుగురుకు తీవ్ర గాయాలు



**నేలకొండపల్లి, మహా :**రోడ్డు ప్రమాదంలో డివైండర్ ఢీకొన్న ఘటనలో నలుగురు కు తీవ్ర గాయాలైయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా, కోదాడ మండలం లోని కొత్తగూడ కు చెందిన నలుగురు యువకులు బైక్ పై మంగళవారం ఖమ్మం నుంచి ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో నేలకొండపల్లి మండల కేంద్రం శివారులో రింగ్ రోడ్డు వద్ద కు రాగానే బైక్ అదుపు తప్పి...డివైండర్ ను ఢీకొట్టింది. దీంతో నలుగురు కు తీవ్ర గాయాలైయ్యాయి. క్షతగాత్రులలో హరి (20), నాగతరుణ్(18), చరణ్(15), మహేందర్(15) లు ఉన్నారు. వీరిలో హరి చెయ్యి బాగా దెబ్బతిన్నది. స్థానికులు నేలకొండపల్లి ప్రభుత్వ హస్పిటల్ కు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరిలించారు.

## ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం ముఖ్య అతిథిగా సర్పంచ్ సుభద్ర



**బూర్గంపహాడ్ మహా :**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి పొందిన శ్రీమతి అనూష - నాగరాజు దంపతుల నూతన గృహ ప్రవేశ కార్యక్రమం గ్రామంలో ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ శ్రీమతి బొర్రా సుభద్ర హాజరై గృహాన్ని ప్రారంభించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న గృహ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి శ్రీమతి భవాని పాల్గొని గృహ యజమానులను అభినందించారు. లబ్ధిదారులు సర్పంచ్ సుభద్ర మరియు కార్యదర్శి భవాని గార్లను శాలువాలతో సన్మానించి తమ కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# టీజేఎస్ ప్లీనరీకి ప్రతీ గడప నుంచి కదిలిరావాలి



- ఉద్యమ ఆకాంక్షాలను సాధించేందుకు నడుం బిగించాలి
- టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్రావు

**నేలకొండపల్లి, మహా:** హైద్రాబాద్ లో జరగనున్న తెలంగాణ జన సమితీ ప్లీనరీ కి ప్రతీ వాడ,. ప్రతీ ఇంటి నుంచి ఉద్యమకారులు కదిలిరావాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్రావు పిలుపునిచ్చారు. మండలం లోని కొత్తకొత్తూరు లో మంగళవారం ప్లీనరీ పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు...టీజేఎస్ 4 వ ప్లీనరీ హైద్రాబాద్ లో మే 12 న జరుగుతుందని తెలిపారు. ఈ ప్లీనరీ విజయంతం కోసం కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. ప్లీనరీ జయప్రదం ను కోరుతూ... గ్రామాలలో విస్తుతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఉద్యమ ఆకాంక్షలను సాధించేందుకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామిక తెలంగాణ ను నిర్మించేందుకు ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని సూచించారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలని కోరారు. ప్రజా సమస్యల పై నిరంతరం పోరు సాగించనున్నట్లు తెలిపారు.ప్రత్యామ్నయ రాజకీయాలకు వేదికగా నిలిచిన టీజేఎస్ ప్లీనరీ తరువాత మరింత బలోపేతం కానున్నట్లు పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మాదాసు శ్రీనివాసరావు, మందడి వెంకటేశ్వరరావు. తీగ రాములు, పి.ధనమూర్తి, మల్సూర్, ఆంజనేయులు, యాకయ్య, వెంకటేశ్వర్లు, కర్లపూడి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## దోసపాటి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో.. మణుగూరు మున్సిపాలిటీకి ఫ్రిడ్జ్ వితరణ




### సిబ్బంది, ప్రజలకు చల్లని తాగునీరు..

**మణుగూరు, మహా :** వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని మణుగూరు మున్సిపాలిటీ సిబ్బంది, వర్కర్లు, కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఉపయోగపడే విధంగా దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫ్రిడ్జ్‌ను అందజేశారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు దోసపాటి వెంకటేశ్వరరావు అండ్ బ్రదర్స్ ఆధ్వర్యంలో దోసపాటి నాగేశ్వరరావు చేతుల మీదుగా మున్సిపాలిటీ కమిషనర్ టి ప్రసాద్‌కు ఫ్రిడ్జ్‌ను అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ టి ప్రసాద్ మాట్లాడుతూ.., మణుగూరు ప్రజల అవసరాలను గుర్తించి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్ సేవలను కొనియాడారు. రూ 10 వేల విలువ గల ఫ్రిడ్జ్ ద్వారా సిబ్బంది, వర్కర్లకు చల్లని తాగునీరు అందేలా చేసినందుకు ట్రస్ట్ ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కత్తి రాము, బండారు నరసింహారావు, శ్యామ్‌తో పాటు మున్సిపాలిటీ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఇంట్లో ఉన్నామనే భావన

### వసతి గృహాలలో ఆకస్మిక తనిఖీలు చేసిన ఎంపీడీఓ



**నేలకొండపల్లి, మహా:** వసతి గృహాలలో విద్యార్థులకు ఇంట్లో ఉన్నామనే భావన కలిగేలా సౌకర్యాలు కల్పించాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. స్టోర్ గదులను సందర్శించారు. కూరగాయలు, సరుకుల నాణ్యత ను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించారు. వసతి గృహాంలో అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... ప్రభుత్వం వసతి గృహాల ను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. నాణ్యత విషయంలో రాజీపడోద్దని సూచించారు. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వసతి గృహాల ను సద్వినియోగం చేసుకునేలా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహాల సంక్షేమాధికారులు నరేందర్రెడ్డి, మున్నీబేగం తదితరులు పాల్గొన్నారు.

# తమిళ తంత్రం.. గెలుపు మంత్రం

## ముక్కోణంలో ముందున్నదెవరు?

### డీఎంకే కూటమి వైపు మొగ్గు.. చెన్నై సిటీలో విజయ్ జోరు

(మహా ఎనాలసిస్)

ద్రవిడ గడ్డ ఇపుడు ఉత్కంఠ రాజకీయాలకు వేదికైంది. దేశమంతా ద్రవిడ దేశం తీర్పు వైపు చూస్తోంది. తమిళనాడు ఎన్నికల ప్రచారానికి తెరపడగా, గురువారం తమిళ ఓటర్లు తీర్పు నివ్వనున్నారు. కుల సమీకరణలు, సంక్షేమ పథకాల హామీలు, పొత్తుల లెక్కలతో చెన్నైలోని వార్ రూమ్‌లు వేడెక్కిపోయాయి. ఫైనల్ లెక్కలు సెటిలవుతున్నాయి. మరికొద్ది గంటల్లో పోలింగ్ జరగనుంది. చెన్నై సిటీలో విజయ్ క్రేజ్ పలు నియోజకవర్గాల్లో బలంగా ఉండగా, యూత్, మహిళలు విజయ్ వైపు మొగ్గుచూపుతున్నారు. ఇది అనేక నియోజకవర్గాల్లో నేతల జాతకాలు తల్లకిందులు చేయనుంది. పోలింగ్ సమీపిస్తున్న కొద్దీ డీఎంకే, ఏఐఏడీఎంకే మధ్య పోటీ ఉత్కంఠ గా మారుతున్నా, మొగ్గు డీఎంఏ వైపే ఉన్నట్లు ట్రెండ్స్ చెబుతున్నాయి.

### వారసత్వ పోరులో స్టాలిన్ టాప్

నాడు జయలలిత, కరుణానిధి లేని తొలి అసెంబ్లీ ఎన్నికలు కావడంతో వారసత్వం పై ఓటర్లు స్పష్టమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 78.2 శాతం మంది ఓటర్లు కరుణానిధి అసలైన వారసుడు స్టాలినే అని తేల్చిచెప్పారు. అటు ఏఐఏడీఎంకేలో ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)కి 47.4 శాతం మంది మద్దతు లభించగా, ఓ పన్నీర్ సెల్వం (ఓపీఎస్) కేవలం 8.9 శాతానికే పరిమితమయ్యారు. ఇటీవలే ఓపీఎస్ తన కుమారుడితో పాటు డీఎంకేలో చేరడం ఆసక్తికరంగా మారింది.

### డబుల్ ఇంజిన్ సర్కార్‌పై వ్యతిరేకత

హిందీ బెల్ట్ రాజకీయాలకు భిన్నంగా తమిళనాడు తన ప్రత్యేకతను చాటుకుంటూవస్తోంది. కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వంపై తమిళ ఓటర్లు 2021లోనే ఆగ్రహం వ్యక్తం చేశారు. 51.9 శాతం మంది కేంద్ర ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేయగా, 47.5 శాతం మంది కేంద్రంలో ఉన్న పార్టీయే రాష్ట్రంలో ఉండాలి అనే (డబుల్ ఇంజిన్) వాదనను తిరస్కరించారు. బీజేపీ ఎదుగుదల రాష్ట్ర సామాజిక ఐక్యతకు కీడు అని 40.3 శాతం మంది అభిప్రాయపడటం గమనార్హం. ఇక తాజాగా డీ లిమిటేషన్ అంశంలో లోక్ సభ సాక్షిగా ఎన్డీఏ ఓడిపోవడం.. డీఎంకేకు కలిసొచ్చింది.




ANN తెలుగు
మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్
22-04-2026

### సర్వేలన్నీ డీఎంకే మాటే....

- లోక్ పోల్ మెగా సర్వే ప్రకారం.. డీఎంకే 40 శాతం ఓట్లతో 180 నుంచి 190 సీట్ల వరకు దక్కించుకుంటుందని తేలింది. తద్వారా స్టాలిన్ మరోసారి సీఎం గా ఎన్నికయ్యే అవకాశం ఉంది. ఒక్కో నియోజకవర్గంలో 500 మందితో.. లక్ష మంది శాంపిల్స్ తీసుకొని ఈ సర్వే చేసినట్లు సదరు సంస్థ ప్రకటించింది. డీఎంకే వ్యతిరేక ఓటు చీలిపోవడంతో స్టాలిన్ కు కలిసి వచ్చే అంశంగా తేల్చింది.
- ప్యారా వీల్ సర్వే ప్రకారం.. డీఎంకే 41.5% ఓట్లు సాధిస్తుందని.. అన్న డీఎంకే కూటమి 36.2% ఓట్లు సాధిస్తుందని.. డీవీకే విజయ్ పార్టీ 13.6% ఓట్లు... ఎన్టికే 7.9% ఓట్లను పొందే అవకాశం ఉంది. ఈ సర్వే ప్రకారం డీఎంకే స్పష్టమైన మెజారిటీతో మరోసారి అధికారం చేపట్టే ఛాన్స్ కనిపిస్తోంది.
- అగ్ని న్యూస్ సర్వీస్ సర్వే ప్రకారం డీఎంకే సూపర్ విక్టరీ సాధిస్తుందని తేలింది. ఆ పార్టీ ఏకంగా 180 నుంచి 234 సీట్లు దక్కించుకుంటుందని సర్వే తేల్చింది. అన్నా డీఎంకే 54 సీట్లతో నిలవచ్చు అని తేల్చి చెప్పింది.
- ఐఏఎన్ఎస్ మ్యాట్రిచ్ సంస్థ మాత్రం అన్న డీఎంకే కు ఆధిక్యత ఉంటుందని తేల్చింది. 11 నుంచి 127 సీట్లతో ముందు వరుసలో నిలవనుంది. డీఎంకే కనిష్టంగా 104, గరిష్టంగా 114 సీట్లను సాధిస్తుందని తేల్చింది. హంగ్ వస్తుందని తేల్చి చెప్పింది.
- న్యూస్ 18 ఓటు వైపు సర్వే డిఎంకెకు స్వల్ప హెచ్చు ఉంటుందని తేల్చింది. డీఎంకే కు 40 శాతం, అన్నా డీఎంకేకు 38% ఓట్లు వచ్చే అవకాశం ఉంది. విజయ్ పార్టీకి 15 శాతం వరకు ఓట్లు వస్తాయని తేల్చింది.
- లయోలా కాలేజ్ ఐపిడిఎస్ సర్వేలో విజయ్ పార్టీ పరిస్థితి బాగుంటుందన్న ఫలితాలు వచ్చాయి. విజయ్ పార్టీ ఏకంగా 50 సీట్లు వరకు సాధించవచ్చని.. 80 సీట్లలో ఆ పార్టీ రెండో స్థానంలో నిలుస్తోందని చెబుతోంది. ప్రత్యేకించి యువత విజయ్ పార్టీ వైపు మొగ్గు చూపినట్లు తేల్చింది.

## తమిళనాడు ఎన్నికల బరిలో నిలిచిన స్టార్ అభ్యర్థులు

### ఎం.కె. స్టాలిన్ (డీఎంకే)



నియోజకవర్గం: కొలత్తూరు ప్రస్తుత ముఖ్యమంత్రిగా ఉన్న స్టాలిన్, తన బలమైన కోట అయిన కొలత్తూరు నుండి మళ్ళీ పోటీ చేస్తున్నారు. సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల కల్పన మరియు సుస్థిర పాలనే లక్ష్యంగా ఆయన ప్రచారం సాగుతోంది. డిఎంకె విజయావకాశాలు పూర్తిగా ఆయన చరిష్మాపైనే ఆధారపడి ఉన్నాయి.

### అన్బుమణి రామదాస్ (పీఎంకే)



కూటమి: ఎన్డీఏ ఉత్తర తమిళనాడులో బలమైన ఓటు బ్యాంకు ఉన్న పిఎంకె నేత అన్బుమణి, ఎన్డీయే కూటమిలో కీలక భాగస్వామి. వన్నియర్ సామాజిక వర్గ ఓట్లను సమీకరించడంలో ఆయన ప్రభావం ఈ ఎన్నికల ఫలితాలపై ఖచ్చితంగా ఉంటుంది.

### ఉదయనిధి స్టాలిన్ (డిఎంకే)



నియోజకవర్గం: చేపాక్-తిరువల్లిక్కేని డిఎంకె తదుపరి వారసుడిగా, యువతలో మంచి ఫాలోయింగ్ ఉన్న నేతగా ఉదయనిధి ఈ ఎన్నికల్లో కీలకంగా మారారు. పార్టీలో మరియు ప్రభుత్వంలో ఆయన ప్రాధాన్యత పెరగడం వల్ల, ఈ స్థానంలో ఆయన విజయం పార్టీ భవిష్యత్తు నాయకత్వానికి ఒక సంకేతంగా నిలవనుంది.

### తమిళిసై సౌందరరాజన్ (బీజేపీ)



నియోజకవర్గం: మైలాపూర్ మాజీ గవర్నర్ తమిళిసై, చెన్నైలోని ప్రతిష్టాత్మక మైలాపూర్ స్థానం నుండి బరిలోకి దిగారు. పట్టణ ఓటర్లను ఆకట్టుకోవడమే కాకుండా, బిజెపిని తమిళనాడులో ఒక ప్రత్యామ్నాయ శక్తిగా నిలబెట్టడానికి ఆమె తీవ్రంగా కృషి చేస్తున్నారు.

### ఎడప్పాడి కె. పళనిస్వామి (ఎఐఎడిఎంకె)



నియోజకవర్గం: ఎడప్పాడి ప్రతిపక్ష నేత పళనిస్వామి, అన్నాడిఎంకెను మళ్ళీ అధికారంలోకి తీసుకురావడానికి శ్రమిస్తున్నారు. తన సొంత నియోజకవర్గమైన ఎడప్పాడి నుండి పోటీ చేస్తూ, డిఎంకె ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను మరియు అవినీతి ఆరోపణలను ప్రధాన అస్త్రాలుగా చేసుకుని ముందుకు వెళ్తున్నారు.

### వానతి శ్రీనివాసన్ (బీజేపీ)



నియోజకవర్గం: కోయంబత్తూర్ రీజియన్ కొంగునాడు (పశ్చిమ తమిళనాడు)లో బిజెపికి ఉన్న అతిపెద్ద బలం వానతి. గతంలో గెలిచిన అనుభవంతో, ఈసారి కూడా ఆ ప్రాంతంలో పార్టీని విజయపథంలో నడిపించే బాధ్యతను ఆమె భుజాన వేసుకున్నారు.

### సి. జోసెఫ్ విజయ్ (టీవీకే)



నియోజకవర్గాల: పెరంబూర్ & తిరుచిరాపల్లి ఈస్ట్ సినీ స్టార్ విజయ్ రాజకీయ రంగప్రవేశం ఈ ఎన్నికల్లో అతిపెద్ద మలుపు. తమిళగ వెట్రి కజగం (టీవీకే) స్థాపించి, ఒకేసారి రెండు చోట్ల పోటీ చేయడం విశేషం. అవినీతి నిర్మూలన, రాజకీయ సంస్కరణలే ఎజెండాగా ఆయన యువత ఓట్లను భారీగా ఆకర్షిస్తున్నారు.

### ఎల్. మురుగన్ (బీజేపీ)



నియోజకవర్గం: అవినాశి కేంద్ర మంత్రి మురుగన్, బిజెపి సామాజిక పునాదిని విస్తరించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అట్టడుగు వర్గాల ఓట్లను పార్టీ వైపు తిప్పుకోవడానికి ఆయన అభ్యర్థిత్వం ఒక వ్యూహాత్మక అడుగు.

### సీమాన్ (ఎన్టీకే)



పార్టీ: నామ్ తమిళర్ కట్చి తమిళ అస్తిత్వం, పర్యావరణ పరిరక్షణ అనే అంశాలపై సీమాన్ రాజీలేని పోరాటం చేస్తున్నారు. ఇప్పటివరకు పెద్దగా సీట్లు గెలవకపోయినా, ప్రతి ఎన్నికల్లో ఓట్ల శాతాన్ని పెంచుకుంటూ వస్తున్న సీమాన్, ఈసారి కూడా ప్రధాన పార్టీలకు గట్టి సవాల్‌గా మారారు.

### కె. అన్నామలై (బీజేపీ)



పాత్ర: ప్రచార సారథి (పోటీలో లేరు) అన్నామలై ఈ ఎన్నికల్లో ప్రత్యక్షంగా పోటీ చేయకపోయినా, బిజెపి ప్రచారానికి ఆయనే ప్రధాన ఇంజిన్. దూకుడుగా వ్యవహరిస్తూ, డిఎంకె ప్రభుత్వాన్ని ఎండగట్టడంలో ఆయన చేస్తున్న పోరాటం తమిళ రాజకీయాల్లో పెను మార్పులకు కారణమవుతోంది.

### మణుగూరు ఏరియాలో..
## వేసవి రక్షణ చర్యలు చేపట్టాలి
**మధ్యాహ్నం పనివేళల్లో సడలింపు ఇవ్వాలని ఏఐటీయూసీ డిమాండ్..**



**మణుగూరు, మహా :** తీవ్రమైన ఎండల నేపథ్యంలో మణుగూరు ఏరియాలో కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వేసవి రక్షణ చర్యలు చేపట్టాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచంద్రకు ఆయన ఆధ్వర్యంలో మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా రాంగోపాల్ మాట్లాడుతూ, మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పనివేళల్లో సడలింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ నెలలోనే మునుపెన్నడూ లేని విధంగా తీవ్ర ఎండలు నమోదవుతున్నాయని, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉందని, ముఖ్యంగా క్వారీ లోతుల్లో ఈ వేడి మరింత ఎక్కువగా ఉండటంతో భారీ యంత్రాలపై పని చేయడం కష్టసాధ్యమవుతోందన్నారు. ఈ పరిస్థితుల్లో కార్మికులు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే కోల్ యార్డులు, ఓసీపీల్లో, కేసీహెచ్‌పీల్లో కోల్ డస్ట్ కారణంగా కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటర్ స్ప్రేలను సక్రమంగా నిర్వహించి డస్ట్ ప్రభావం తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యవంతమైన కార్మికుడే సంస్థకు బలమని పేర్కొంటూ, వేసవి కాలంలో పని గంటలలో సడలింపుతో పాటు కాంట్రాక్ట్ కార్మికుల టైమింగ్స్ కూడా మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఎంవి రాంనర్సయ్య, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మేకల ఈశ్వర్ రావు, జాయింట్ సెక్రటరీ పుల్లారావు, ఆఫీస్ బేరర్స్ గోలి గంగాధర్ రావు, ఆదర్ల సురేందర్, పిట్ సెక్రటరీలు ఎస్ కుమారస్వామి, సాయిప్రకాష్ చారి తదితరులు పాల్గొన్నారు.

## మేడిగడ్డ బ్యారేజీ పనుల్లో కేఎల్ఆర్ ఇండస్ట్రీస్

- నాణ్యతా ప్రమాణాలను సీఎంకు వివరించిన లక్ష్మారెడ్డి
- మట్టి పరీక్షల తర్వాత పునరుద్ధరణ పనులు: కిచ్చెన్న



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** సాంకేతిక బృందంతో మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ పనుల్లో కేఎల్ఆర్ ఇండస్ట్రీస్ భాగస్వామ్యం అయింది. ప్రాజెక్టు రీడిజైన్ పేరుతో వేల కోట్ల ప్రజాధనం వృధా చేసి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు భవిష్యత్ పై సీఎం రేవంత్ రెడ్డి నిన్న రివ్యూ మీటింగ్ నిర్వహించారు. మట్టి పరీక్షలు చేసిన తర్వాత పూర్తి సామర్థ్యం ఉండేలా నిర్మాణం చేపట్టాలని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తుందని, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. గత రెండ్రోజులుగా జయశంకర్ భూపాలపల్లిలో ఉండి మేడిగడ్డ బ్యారేజీ పనుల పునరుద్ధరణ, సాంకేతిక అంశాలపై నిపుణుల బృందంతో కేఎల్ఆర్ చర్చిస్తున్నారు.గతంలో జరిగిన తప్పులు మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించినట్లు కిచ్చెన్నగారు తెలిపారు. బ్యారేజీ కూలిపోవడానికి గత కారణాలను డ్రిల్లింగ్ ఇతరాత్రా పనుల ద్వారా అన్వేషిస్తున్నట్లు చెప్పారు. సాంకేతిక అంశాలు పూర్తి చేసి... నవంబర్ లో పునరుద్ధరణ పనులు మొదలు పెడిత వచ్చే ఏడాది సాగునీటిని అందుబాటులోకి తీసుకురావొచ్చని కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రులు ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు...



### ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలు

**నేలకొండపల్లి:**అది శంకరాచార్యులు జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం లోని శ్రీ ఉత్తరేశ్వరస్వామి దేవాలయం లో శంకరాచార్యుల విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. లలితా, సౌందర్య లహారి, పారాయణం ను నిర్వహించారు. పెద్ద మెత్తం లో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.దేవాలయం చైర్మన్ చంద్రమూళి, జక్కేపల్లి పాపయ్య, జ్వాలయ్య, పెండ్యాల గోపాలకృష్ణమూర్తి, ఆలయ అర్చకులు శివయ్య. ఉషారాణి, వేదమ్మ, పావని, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

## గేటుకారేపల్లిలో చలివేంద్రం ప్రారంభం
**ప్రారంభించిన సర్పంచ్ ఎల్లయ్య. కార్యదర్శి అనూష**




**కారేపల్లి, మహా :** గేటుకారేపల్లిలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. గేటుకారేపల్లి బస్ స్టాండ్ సెంటర్ చలివేంద్రాన్ని సర్పంచ్ పూనెం ఎల్లయ్య కార్యదర్శి కే.అనూష లు ప్రారంభించారు. వేసవి ఎండల దృష్ట్యా, ప్రయాణికులు, బాటసారుల దాహార్తిని తీర్చడానికి పంచాయతీ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్ వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని సర్పంచ్ తెలిపారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సహకారంతో గ్రామపంచాయతీ అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. పంచాయతీ అభివృద్ధికి గ్రామస్తుల సహకారం ఎంతో ఉందన్నారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు కందులు శ్రీనివాసరావు, మూడు శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు చెరుకూరి నర్సయ్య, చెరుకూరి రామారావు, బానోత్ బావుసింగ్, కుసుమ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటి పర్యటనకు భారీ ఏర్పాట్లు..

- లంక మల్లారంలో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు..
- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నవీన్..



**మణుగూరు, మహా :** పినపాక నియోజకవర్గం మణుగూరు మండలంలో ఈ నెల 23న రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 7 గంటలకు లంక మల్లారం గ్రామపంచాయితీ పరిధిలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ గర్ల్స్ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్మించిన డార్మెటరీ భవనాన్ని మంత్రి ప్రారంభించనున్నారన్నారు. అనంతరం ఆర్ అండ్ బి రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరుకానుండగా, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కూడా పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని అయిన ఈ సందర్భంగా కోరారు.

## చదివిన కాలేజీలోనే చీఫ్ గెస్ట్ గా సర్పంచ్
**విద్యార్థుల్లో ఉత్సాహం నింపిన సమ్మర్ క్యాంప్**



**కారేపల్లి, మహా:** మండల పరిధిలోని అప్పాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్.ఆర్.ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో ఉన్న తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల & జూనియర్ కళాశాలలో సమ్మర్ క్రీడా శిబిరం ప్రారంభమైంది.ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ దండు ప్రవీణ్ మంగళవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల అభివృద్ధి కోసం ఇలాంటి శిబిరాలు ఏర్పాటు చేయడం మంచి పరిణామమనితెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా మైనారిటీ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని,చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలని సూచించారు. తాను చదివిన కాలేజీలోనే చీఫ్ గెస్ట్‌గా రావడంఎంతో సంతోషంగా ఉందని పేర్కొంటూపాత జ్ఞాపకాలను విద్యార్థులతోపంచుకున్నారు. పాఠశాల అవసరాలను తమ దృష్టికి తీసుకురావాలని, భోజన వసతులు నిబంధనల ప్రకారం ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎల్ సి అరుణ కుమారి,ప్రిన్సిపాల్ డి. సావిత్రి,విజిలెన్స్ అధికారి, పీడీ, పి.ఈ.టి లు కోచ్‌లు పాల్గొన్నారు.

## సురంగల్ 14వ వార్డులో రోడ్డు ఇరువైపులా చెట్ల పొదలు తొలగింపు

- డోజర్‌తో పారిశుద్ధ్య పనులు చేపట్టిన కౌన్సిలర్ శ్రీధర్
- 99 రోజుల ప్రణాళికలో భాగంగా చైర్మన్, కమిషనర్ సహకారంతో చర్యలు
- పాముల బెడద తొలగడంతో హర్షం వ్యక్తం చేసిన వార్డు వాసులు



**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్ 14వ వార్డులో రోడ్లకు ఇరువైపులా విపరీతంగా పెరిగిన చెట్ల పొదలను, ఇళ్ల మధ్య పేరుకుపోయిన చెత్తను డోజర్, ట్రాక్టర్ల సాయంతో తొలగించి రోడ్లను పరిశుభ్రం చేయించినట్లు వార్డు కౌన్సిలర్ కర్రోల్ల శ్రీధర్ తెలిపారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్రీధర్ మాట్లాడుతూ, 99 రోజుల ప్రణాళికలో భాగంగా మా వార్డులో ఉన్న సమస్యలను మున్సిపల్ చైర్మన్ గారి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. వారు వెంటనే స్పందించి చైర్మన్ మరియు కమిషనర్ గార్ల ఆదేశాలతో డోజర్, ట్రాక్టర్లు ఏర్పాటు చేశారు అని వివరించారు. వార్డులో రోడ్లకు ఇరువైపులా చెట్ల పొదలు దట్టంగా ఉండటంతో వేసవికాలంలో సాయంత్రం వేళల్లో ప్రజలు బయట కూర్చునేందుకు భయపడుతున్నారని, పురుగులు, పాములు వచ్చే ప్రమాదం ఉందని వార్డు ప్రజలు పలుమార్లు తన దృష్టికి తెచ్చారని శ్రీధర్ తెలిపారు. ప్రజల ఫిర్యాదు మేరకు వెంటనే చైర్మన్, కమిషనర్ గార్లతో మాట్లాడి పొదల తొలగింపు పనులు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పారిశుద్ధ్య కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ ఎలుగంటి ఎట్టయ్య గౌడ్, కందికొండ శ్రీకాంత్, ఎలుగంటి లోకేష్ గౌడ్, ముద్దపురం రాఘవేంద్ర గౌడ్, చాకలి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.




### జనగణన శిక్షణ తరగతులు..

**రాజేంద్రనగర్ మహా ;** భారతదేశ 202627 జనాభా గణన కోసం ఎన్యూమరేటర్లు మరియు సూపర్ వైజర్లకు విస్తృత శిక్షణ తరగతులను శంషాబాద్ సర్కిల్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) లో మంగళవారం నిర్వహించారు.ఈ గణన పూర్తిగా డిజిటల్ పద్ధతిలో, మొబైల్ యాప్‌ల ద్వారా, అలాగే తొలిసారి స్వీయ గణన సదుపాయంతో జరగనుంది. శిక్షణలో ఇళ్ల జాబితా, జిపిఎస్ ట్యాగింగ్ తో డేటా నమోదుపై రెండో బ్యాచ్ కి శిక్షణా తరగతులు కల్పిస్తున్నారు.



### స్ట్రాంగ్ మ్యాన్ ఆఫ్ తెలంగాణ సాధించిన భరత్ యాదవ్

**రాజేంద్రనగర్ మహా ;** మేడ్చల్ సనత్ నగర్ లో పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ 2026 పోటీలో శంషాబాద్ కు చెందిన యువకుడు మానుక భారత్ యాదవ్ సత్తా చాటాడు.పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ 2026 తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్స్ (బాలురు మరియు బాలికలు) మాస్టర్స్ (పురుషులు మహిళలు) క్లాసిక్ పవర్ లిఫింగ్ ఛాంపియన్షిప్ 2026 పోటీలను సనత్ నగర్ లో అట్టహాసంగా నిర్వహించారు.పవర్ లిఫ్టింగ్ పోటీ లో శంషాబాద్ సర్కిల్లోని యాదవ్ ఫిట్నెస్ జిమ్ కు చెందిన మానుక భరత్ యాదవ్ 74 కేజీల పవర్ లిఫ్టింగ్ లో బంగారు పతకంతో పాటు జూనియర్ స్ట్రాంగ్ మ్యాన్ ఆఫ్ తెలంగాణ కీర్తి కిరీటాన్ని సాధించారు.



### జాతీయ పౌర సేవకుల దినోత్సవం సందర్భంగా సాయి భోజన్

- గర్భిణులకు,బాలింతలకు డయాలసిస్ పేషెంట్లకు అన్నదానం
- ప్రభుత్వ ఆసుపత్రిలో కార్యక్రమం
- బాయిజమ్మ సాయిసేవాట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహణ

**బెల్లంపల్లి,మహా:** జాతీయపౌరసేవకుల దినోత్సవం సందర్భంగా బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం మధ్యాహ్నం సనాతనధర్మబాయిజమ్మ సాయి భక్తి ప్రచార ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ సహకారంతో గర్భిణులకు బాలింతలకు, డయాలసిస్ రోగులకు, అన్నార్తులకు సాయి భోజన్ అన్నదానంచేసినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్ రాజేశ్వరి తెలిపారు.ఈ సందర్భంగా ఆస్పత్రిలోని,గర్భిణీలు,బాలింతలు,రోగులు, అన్నార్తులు,ఆసుపత్రి సిబ్బంది,సాయి భోజన్ అన్నదాన కార్యక్రమాన్ని వినియోగించుకున్నారు. వారందరూ అన్నదానం చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ వారికి మరియు దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.ట్రస్ట్ ద్వారా "ఆకలితో ఉన్నవారిని అతిథి సత్కారంతో ఆదరిద్దాంఅన్నదానంతో తృప్తి పరుద్దాం" అని ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్‌రాజేశ్వరి పిలుపునిచ్చారు. సేవే లక్ష్యం, సేవే మార్గంతో ట్రస్ట్ కొనసాగుతుందని,మానవ సేవే మాధవ సేవ అని త్రవిద్య, శ్రవిద్య, త్రయాక్షర్ సూచించారు.ఈ సేవా కార్యక్రమములో ట్రస్ట్ మేనేజర్ బొద్దున సతీష్,సభ్యులు జేరిపోతుల చంద్రకళ సేవకులు పోతురాజుల తిరుపతి,జక్క రాజేష్ కుమార్, ఉప్పట్ల భీమయ్య, బండారి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## లబ్దిదారులే నివసించాలి లేదంటే రద్దు.!




- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి
- సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్
- పూర్తయిన నిర్మాణ దశలో ఉన్న ఇండ్లను లబ్దిదారులకు కేటాయించాలి
- బిహెచ్‌కే ఇండ్లు పొందిన లబ్దిదారులు తప్పకుండ నివసించాలి
- డబుల్ బిహెచ్‌కే ఇండ్లలో నివసించని వారికి నోటీస్ ఇచ్చి రద్దు చేయండి.?

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** డబుల్ బిహెచ్‌కే ఇండ్లు పొందిన లబ్దిదారులు, కేటాయించిన ఇండ్లలో తప్పకుండా నివసించాలని జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి తెలిపారు. లేదంటే నోటీసులు ఇచ్చి రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఎంపిక చేసిన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు.మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి హౌసింగ్ అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పూర్తి అయిన, నిర్మాణ దశలో ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించుటకు ఎంపిక చేసిన లబ్దిదారులకు కేటాయించాలని తెలిపారు. సంబంధిత ఆర్డీఓలు, డిప్యూటీ కమిషనర్లు ఇందిరమ్మ కమిటీల ద్వారా ఎల్2 లిస్ట్ నుండి పేదవారిని ఎంపిక చేయాలని సూచించారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్లు పొందిన లబ్దిదారులు వాటిలో నివాసం ఉండని లబ్దిదారులందరు వెంటనే తమకు కేటాయించిన ఇండ్లలో నివసించాలని, ఏమైనా ఇబ్బందులు తెలియజేయాలని, లేని యెడల వారికి కేటాయించిన ఇండ్లను రద్దు (cancel) చేసి కొత్త వారికి కేటాయించడం జరుగుతుందని తెలిపారు. సంబంధిత అధికారులందరూ పూర్తి బాధ్యతో పని చేసి నిర్దేశించిన లక్ష్యాన్ని సమన్వయంతో సమిష్టిగా పని చేసి గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కె.శ్రీనివాస్, జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ డి.చాంప్లా నాయక్, ఆర్డీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పై అవాకలు చవాకులు పేలితే సహించేది లేదు!

- టిఆర్ఎస్ నాయకులకు తగు రీతిలో బుద్ధి చెప్తాం..!
- మాజీ ఎమ్మెల్యే చేసిన అవినీతిపై చర్చకు తాము సిద్ధం మీరు సిద్ధమా.?
- నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నేతలు!



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** స్థానిక ఎమ్మెల్యే రంగారెడ్డి పై అవాకుల చివాకులు పేలితే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ నేతలు హెచ్చరించారు. మంగళవారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కేంద్రంలోని ప్రజా భవన్ లో ఏఎంసి చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశానికి హాజరైన, ఇబ్రహీంపట్నం మాజీ జెడ్పిటిసి భూపతిగల్ల మహిపాల్, మున్సిపాలిటీ కౌన్సిలర్లు నీళ్ల భానుగౌడ్, ఇందూరి శ్రీనివాస్, రాందాస్ నాయక్, మంచాల పిఎసిఎస్ మాజీ చైర్మన్ హనుమంత్ రెడ్డి, మండల అధ్యక్షులు రవీందర్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డిలు మాట్లాడుతూ... టిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే తనయుడు ప్రశాంత్ కుమార్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ అనవసరమైన ఆరోపణలు చేసి ఆయన ప్రతిష్టకు భంగం కలిగేలా వ్యవహరిస్తే తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. గత 15 సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉన్న మంచిరెడ్డి కిషన్ రెడ్డి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో చేసిన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు రోజుకు ఒక డ్రామా చేస్తున్నారని, ప్రజలలో ఆదరణ కోల్పోవడం, ప్రజలు పట్టించుకునే పరిస్థితిలో లేకపోవడంతో రోజుకు ఒక రీతిలో వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. మాజీ ఎమ్మెల్యే చేసిన అవినీతిపై చర్చకు తాము సిద్దామని, దీనికి మీరు సిద్ధమేనా అని కాంగ్రెస్ పార్టీ నాయకులు సూటిగా ప్రశ్నించారు. కార్యకర్తలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం దురుసుగా ప్రవర్తించడం సరైన పద్ధతి కాదని, నియోజకవర్గ అభివృద్ధికి సహకరించే విధంగా వ్యవహరించాలని సూచించారు. ఎమ్మెల్యే పై అవాకులు చివాకులు పేలితే ఇకనుంచి తాము కూడా అదే రీతిలో తగిన బుద్ధి చెప్పడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు హెచ్చరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు రమాకాంత్ రెడ్డి, రామ్ రెడ్డి, ఏ భరత్ రెడ్డి, ఏ రాజు, బందే రాజశేఖర్ రెడ్డి, దారు రాఘవేందర్, మహమ్మద్ గౌస్, సుధాకర్, మహేందర్, పలు మండలాల అధ్యక్ష కార్యదర్శులు కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లులో సామాజిక న్యాయం అమలు చేయాలి




**బెల్లంపల్లి, మహా:** మహిళారిజర్వేషన్ బిల్లులో సామాజిక న్యాయం అమలు చేయాలనీ బెల్లంపల్లి పట్టణంలోని సిపిఐకార్యాలయంలో దళిత హక్కుల పోరాట సమితి సమావేశంలో నాయకులు తీర్మానించారు.రాష్ట్ర సమితికి ఎన్నికైన జిల్లా నాయకత్వానికి సన్మాన కార్యక్రమం ను డి హెచ్ పి ఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోచన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళిత క్రైస్తవుల తీర్పును పునర్ సమీక్షించాలని,దేశం లో మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు తీసుకొచ్చిన33% మహిళా రిజర్వేషన్ బిల్లు సామాజిక న్యాయ సూత్రాలను పూర్తిగా ప్రతిబింబించేలా ఉండాల్సిన అవసరం ఉందని, మహిళా రిజర్వేషన్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు ప్రత్యేకంగా వాటా కేటాయిస్తూ సామాజిక న్యాయం అమలు చేయాలని డిమాండ్ చేశారు.దేశంలో దళిత క్రైస్తవులపై జరుగుతున్న అన్యాయం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మతం మారిన కారణంగా దళితుల హక్కులను నిరాకరించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. దళిత క్రైస్తవుల రిజర్వేషన్‌కు సంబంధించిన న్యాయ,విధాన పరమైన అడ్డంకులను తొలగించి, సంబంధిత తీర్పులను పునర్ సమీక్షించాలనికేంద్ర, రాష్ట్రప్రభుత్వాలను కోరారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే, డి హెచ్ పి ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఏప్రిల్ 16 , 17 తేదీలలో వరంగల్ లో జరిగిన 2వ రాష్ట్ర మహాసభల్లో ఎన్నికైన దేవి పోచన్న రాష్ట్ర ఉపాధ్యక్షులు రాష్ట్ర సమితి సభ్యులుగా మామిడి గోపి బొల్లం తిలక్ అంబేద్కర్ గార్లను బెల్లంపల్లి పట్టణ సిపిఐ ప్రజాసంఘాల నాయకులు సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, సిపిఐ సీనియర్ నాయకులు చిప్ప నరసయ్య, సిపిఐ మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, నాయకులు గుండా మాణిక్యం, రత్నం రాజన్న, బొంకూరి రామచందర్ తదితరులు పాల్గొన్నారు.



### వేసవి నీటి ఎద్దటి లేకుండా చర్యలు
**మంచినీటి బోర్ ను ప్రారంభించిన సర్పంచ్ హీరాలాల్**

**కారేపల్లి, మహా:** వేసవి కాలం లో ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్లు కారేపల్లి మండలం, భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరాలాల్ అన్నారు. మంచి నీటి కొరత తీర్చడానికి గాను భాగ్యనగర్ తండా 5 వార్డ్ లో వేసిన మంచినీటి బోర్ నుండి మంచినీటి సరఫరా కార్యక్రమం ను సర్పంచ్ ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు నీటిని పొదుపుగా వాడుకోవాలని, త్రాగునీటిని వృధా చేయవద్దని కోరారు. ఈ కార్యక్రమం లో వార్డ్ సభ్యురాలు జర్పలా సంధ్య, కాంగ్రెస్ జిల్లా నాయకులు భీముడు నాయక్, సందీప్, సోమ్లా, గిరిప్రసాద్, ఝాంకిలాల్, పంచాయతీ సిబ్బంది హేంచంద్, రాందాస్ రమేష్, రాధా, చరణ్ తదితరులు పాల్గొన్నారు



### యూనిఫైడ్ కౌన్సిల్ అంతర్జాతీయలలో బోటనీ బాలాజి విద్యార్థుల బంగారు పతకాల పంట

**దమ్మపేట, మహా :** 202526 విద్యా సంవత్సరంకు గాను యూనిఫైడ్ కౌన్సిల్ నిర్వహించిన ఒలంపియాడ్ పరీక్షలలో స్థానిక బోటనీ బాలాజీ పాఠశాల విద్యార్థులు బంగారు పతకాల వర్షం కురిపించారు. ఈ విషయమై పాఠశాల లో మంగళవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో యం.ఇ.వో. జగపతి ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. అంతర్జాతీయ మ్యాథ్స్ ఒలంపియాడ్ లో 23 బంగారు పతకాలు, అంతర్జాతీయ సైన్స్ ఒలంపియాడ్ లో 20 బంగారు పతకాలు,అంతర్జాతీయ ఇంగ్లీష్ ఒలంపియాడ్ లో 10 బంగారు పతకాలు,276 జాతీయస్థాయి మరియు రాష్ట్రీయ స్థాయి ర్యాంకులు సాధించి బోటని బాలాజీ స్కూల్ విద్యార్థులు అగ్రగామిగా నిలిచారని ప్రశంసించారు. ప్రత్యేకంగా టీ. ఉదయ్ రాఘవ విద్యార్థికి నగదు బహుమతి లభించింది. అనంతరం మండల విద్యాశాఖ అధికారి జగపతి చేతులమీదుగా బంగారు పతకాలను, ప్రసంశా పత్రాలను బహుకరించడం జరిగింది. పాఠశాల కరస్పాండెంట్ నర్సన్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రణాళిక బద్ధమైన విద్యా విధానం ద్వారానే ఈ విజయం సాధించగలిగామని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బాలాజీ , ప్రిన్సిపల్ అనంతరావు , కోఆర్డినేటర్స్ సుధాకర్, నాజియా సుల్తానా ,ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలియచేశారు.



### ఎసై.సాయికిషోర్ రెడ్డిని అభినందించిన ఎస్పీ రోహిత్ రాజ్

**దమ్మపేట ,మహా :** దమ్మపేట పోలీస్ ఎసై.సాయికిషోర్ రెడ్డిని భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ప్రశంసా పత్రం అందించి అభినందించారు.నేషనల్ లోక్ అదాలత్ ,డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు ,పిటీ కేసుల లో ఎక్కువగా పరిష్కార మార్గాలు చూపినందుకు గాను జిల్లా ఎస్పి రోహిత్ రాజ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా దమ్మపేట స్టేషన్ పరిదిలో పలువురు కానిస్టేబుల్ సిబ్బంది మిఠాయిలు పంపిణీ చేసుకున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర చర్యలు

**పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ**



**మంచిర్యాల, మహా :** తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో ప్రజా పాలన ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు. మంగళవారం జిల్లా ఎం.పి. నివాసంలో ఏర్పాటు చేసిన ప్రజా వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ లతో కలిసి అర్జీదారుల నుండి పలు సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వంలో ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రతినిత్యం అందుబాటులో ఉంటున్నామని తెలిపారు. ప్రజలకు ముఖ్యమైన పనులైనటువంటి రహదారులు, త్రాగు నీరు, పారిశుధ్యం ఇతర సమస్యలపై అధికారుల సమన్వయంతో పరిష్కరిస్తున్నామని తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నామని, ప్రజలకు సమస్యలు లేకుండా శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకంలో భాగంగా 75 లక్షల మంది రైతుల కొరకు 6 వేల కోట్ల రూపాయలు అందించేందుకు చర్యలు తీసుకుంటుందని చెప్పారు. రైతు అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ రైతుల వెన్నంటే ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలోని మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి కొరకు కృషి చేస్తుందని, ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలను వివిధ వ్యాపార రంగాలలో రాణించేందుకు రుణ సదుపాయం కల్పించి ప్రోత్సహిస్తుందని తెలిపారు. అనంతరం అమృత్ భారత్ పథకంలో భాగంగా మంచిర్యాల పట్టణంలోని రైల్వే స్టేషన్ లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రజా పాలనలో పది సంవత్సరాల లో జరగని అభివృద్ధి రెండున్నర సంవత్సరాల కాలంలో జరుగుతుందని సంతృప్తి వ్యక్తం చేశారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనుల కొరకు నిధులు కేటాయించి క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షిస్తూ వేగవంతం చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా అమృత భారత్ పథకంలో 25 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, పనులు త్వరగా పూర్తిచేసే విధంగా పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాలలో సంబంధిత అధికారులు, రైల్వే శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అయిలా పండరినాథ్ అవార్డు అందుకున్న మోహన్ బైరాగి



**ఆలేరు, మహా:** జనగామ జిల్లా పెంబర్తి అభినందన కల్చరల్ సొసైటీ, పెంబర్తి వారిఅయిలా పండరినాథ్ స్మారక అవార్డును తెలంగాణ ఉద్యమకారుడు, కవి, రచయిత, సీనియర్ జర్నలిస్ట్ మోహన్ బైరాగి అందుకున్నారు. జనగామ జిల్లా కేంద్రంలో జనగామ కవులు కళాకారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి, నెల్లుట్ల రమాదేవి,డాక్టర్ మాచర్ల బిక్షపతి, రవీందర్ రావు,హైకోర్టు న్యాయవాది సాదిక్ అలీ, అయిలా సోమనర్సిమ చారిలుకవి, రచయిత, సీనియర్ జర్నలిస్ట్ మోహన్ బైరాగికి అవార్డును అందజేశారు.ఈ సందర్భంగా వక్తలు ప్రసంగిస్తు.. తెలంగాణ ఉద్యమ సాహిత్య యోధుడుతెలంగాణ రాష్ట్ర సాధనలో కళ, సాహిత్యం, ప్రజా ఉద్యమాలతో అనుబంధం కలిగిన వ్యక్తులలో ఒకరు మోహన్ బైరాగి అని అన్నారు.1976 జనవరి 15న ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని అంతప్పగూడ గ్రామం కమ్మరి శంకరమ్మ, సంగమేశ్వరచారి రెండవ సంతానంగా ,హైదరాబాద్ కూకట్‌పల్లిలో పుట్టి పెరిగారని అన్నారు. జి. కృష్ణ మాట్లాడుతూ భార్య పద్మ, కొడుకు వెంకట్, కూతురు వెన్నెలతో హైదరాబాద్ కూకట్పల్లి లో ఉంటున్న మోహన్ బైరాగి 1996 నుండి ప్రజా ఉద్యమాల్లో, ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో చురుకుగా పాల్గొన్నారని,తెలంగాణ అస్తిత్వం, అమరవీరుల గాథలు, ప్రజా సమస్యలు, ఆస్తిత్వ వాద పోరాటాలు - ఇవన్నీ ఆయన రచనల్లో ప్రధాన ఇతివృత్తాలుగా నిలిచాయని తెలిపారు.సాహిత్య ప్రస్థానం 1998లో ప్రారంభమైందని, అప్పటి నుండి అమరవీరులపై, తెలంగాణ ఉద్యమంపై, సామాజిక అంశాల పై ఇప్పటి వరకు సుమారు 70 పాటలు 30 కవితలు రచించారు.మలి దశ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలకంగా పని చేశారని, కొన్ని నెలల పాటు జైలు జీవితం గడపడం జరిగిందని తెలిపారు.అయిలా సోమ నర్సింహా చారి మాట్లాడుతు మోహన్ బైరాగి రచనలు సామాజిక, ఉద్యమ ప్రేరణతో కూడిన స్వభావాన్ని తెలియజేస్తున్నాయని, ఆయన రచనలు ప్రధానంగా ఉద్యమ వేదికలు, సభలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పలువురు గాయకులు గానం చేశారని అన్నారు. ఆయన సాహిత్యంపై ప్రభావం చూపిన కవులు, రచయితలలో శ్రీశ్రీ, గద్దర్, వంగపండు, గోరటి వెంకన్న, మిత్ర, అసుర వంటి ప్రగతిశీల, ప్రజా సాహిత్య దిగ్గజాలు ఉన్నారని, మోహన్ బైరాగి రచనల్లో పోరాటస్ఫూర్తి, జనవాద దృక్పథం స్పష్టంగా కనిపిస్తాయని తెలిపారు. డాక్టర్ మాచర్ల బిక్షపతి మాట్లాడుతు.. అంతప్ప గూడ చంద్రమోహన్ ప్రజా ఉద్యమ సాహిత్యంలో మోహన్ బైరాగి పేరుతో అనేక రచనలు చేశారనితెలంగాణ రాష్ట్ర సాధన తర్వాత కూడా ఆయన క్రియాశీలకంగా ఉన్నారని అన్నారు.అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య (ACF) రాష్ట్ర అధ్యక్షుడిగా, తెలంగాణ సినిమా వేదిక ప్రధాన కార్యదర్శిగా , కీలక పాత్ర పోషిస్తున్నారని,ఉద్యమ కళాకారుల హక్కులు, పెన్షన్లు, ఉద్యోగాలు, సౌకర్యాల కోసం ధర్నాలు, పోరాటాల్లో చురుకుగా పాల్గొంటు. త్యాగాల తెలంగాణను గుర్తుచేస్తూ, ఉద్యమ స్ఫూర్తిని కాపాడుతూ ఆయన నిరంతరం పోరాడుతున్నారు.మోహన్ బైరాగి ఒక కవి మాత్రమే కాదు - ప్రజా ఉద్యమ యోధుడు, సాంస్కృతిక కార్యకర్త, జర్నలిస్ట్. తెలంగాణ అస్తిత్వాన్ని పాటలు, కవితల ద్వారా బలోపేతం చేసిన ఆయన రచనలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు.ఆయన సాహిత్యం జనజీవనంలో భాగమైందని తెలంగాణ సాధనలో ఆయన వంటి కళాకారుల కృషి ఎన్నటికీ మరచిపోలేనిదని అన్నారు.అవార్డు గ్రహీత మోహన్ బైరాగి మాట్లాడుతూ ఈ అవారు తన పై మరింత బాధ్యత పెంచిందని,అభినందన కల్చరల్ సొసైటీ, పెంబర్తి వారికి, జనగామ కవులు కళాకారుల ఐక్య వేదికు ధన్యవాదాలు తెలిపారు.

# ఎన్యుమరేటర్ల పాత్ర ఎంతో కీలకం

**తహశీల్దారు వలిగొండ ఆంజనేయులు**



**ఆలేరు, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనాభా లెక్కల సేకరణపై ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు మంగళవారం శిక్షణ కార్యక్రమం ముగిశాయిఈ ముగింపు కార్యక్రమంలో ఆలేరు తాహసిల్దార్ వలిగొండ ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనాభా లెక్కల సేకరణ విషయంలో ఈ మూడు రోజుల శిక్షణలో నేర్చుకున్న విషయాలు ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు ఎంతో కీలకమైనవని, సర్వేను చాలా జాగ్రత్తతో నిర్వహించినట్టయితే రాబోయే తరాలకు ఎంతో మేలు చేసిన వార్తెతారని అన్నారు. ఈ సేకరణ ద్వారానే రాబోయే కాలంలో అభివృద్ధి ప్రణాళికలకు సంబంధించిన ఎన్నో విషయాలు సాధ్యమవుతాయని అందువల్ల జాగ్రత్తగా సమాచారాన్ని సేకరించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజలకు కూడా సూచనలు చేస్తూ, మీ మీ ఇళ్లకు వచ్చినప్పుడు సరైన సమాచారం అందించాలని, అలా అందించినప్పుడే సరైన అభివృద్ధి ప్రణాళికలకు సాధ్యమవుతాయని ఆయన అన్నారు ప్రతి ఎన్యుమరేటర్ తనకు కేటాయించిన బ్లాక్ లను, వాటికి సంబంధించిన మ్యాపులను సరిచూసుకొని ఫీల్డ్ మీదకి వెళ్లాలని, ఫీల్డ్ లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆయా గ్రామ స్థాయిలో ముందస్తు ఏర్పాట్లు చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు దూడల వెంకటేష్, తిరుపతి రెడ్డి ఉపాధ్యాయులు దశమంత రెడ్డి, నాగేశ్వర్ రావు, లచ్చునాయక్, నరేష్, జ్యోతిర్మయి, జ్యోతి, నాగలక్ష్మి, ఏ ఎస్ ఓ మహేష్, భవాని, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న సుధా హేమెందర్ గౌడ్

**యాదగిరిగుట్ట, మహా:**యాదగిరిగుట్ట మాజీ మున్సిపల్ చైర్పర్సన్ ఎరుకల సుధాహేమెందర్ గౌడ్ తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని మంగళవారం దర్శించుకొని మొక్కలు చెల్లించుకున్నారు వారితోపాటు యాదగిరిగుట్ట సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుండ్లపల్లి శ్రీరాములు గౌడ్ సతిసమేతంగా శ్రీ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు...

# ధాన్యం తేమ శాతం చూసి వెంటనే కొనుగోలు చేయాలి



**యాదాద్రి భువనగిరి, మహా:**రైతులు పండించిన ధాన్యం కుప్పలు తేమ శాతం చూసి వెంటనే కాంటావేసి కొనుగోలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో వ్యవసాయ శాఖ లో పనిచేస్తున్న ADAs, MAOs మరియు AEOs కు మరియు మార్కెటింగ్, coperative , civil supplies శాఖలకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర రావు, మరియు రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఈఓలు ప్రతి రోజు ధాన్యం కొనుగోలు సెంటర్లను సందర్శించి తేమశాతం పరిశీలించాలన్నారు. వరికుప్పలను పరిశీలించి వాటి నాణ్యత పరిశీలించవలసినదిగా ఆదేశించారు. అన్ని కుప్పలు త్వరగా మాయిశ్చర్ వచ్చాయా అని పరిశీలించాలన్నారు. అశ్రద్ధ వహించిన యెడల సంబంధిత వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటారని తెలియజేశారు. జిల్లా వ్యవసాయ అధికారి స్ప్రెడ్ షీట్ పెట్టి ఉదయం సందర్శించి, రిపోర్టు సమర్పించాల్సిందిగా ఆదేశించారు. దీనిలో ఎటువంటి నిర్లక్ష్యాన్ని కూడా సహించబోమని సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేయడం జరిగింది.ధాన్యం పరిశీలన విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం చేయకూడదని, ఉదయం ఆరు నుండే ఫీల్డ్ లో ఉండాలని, నాణ్యత కలిగిన ధాన్యమును మాత్రమే మిల్లులకు తరలించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి రోజా రాణి , జిల్లా సరఫరాల మేనేజర్ హరికృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి రమణారెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మెడిటెక్ రంగానికి గ్లోబల్ హబ్‌గా తెలంగాణ

**నెదర్లాండ్స్ ప్రతినిధి బృందంతో మంత్రి శ్రీధర్ బాబు కీలక భేటీ**

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో 'వ్యాక్సిన్ క్యాపిటల్'గా తన ముద్ర వేసిందని, ఇప్పుడు మెడికల్ డివైజ్‌లు (వైద్య పరికరాలు) మరియు మెడిటెక్ రంగంలో ప్రపంచానికి నాయకత్వం వహించేందుకు సిద్ధంగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం సచివాలయంలో నెదర్లాండ్స్‌కు చెందిన ఇన్నోవేషన్ కౌన్సెలర్ జాన్ రీన్త్ స్మిత్ నేతృత్వంలోని మెడిటెక్ పారిశ్రామికవేత్తలు మరియు పరిశోధకుల బృందం మంత్రితో ప్రత్యేకంగా భేటీ అయ్యింది. ఈ సందర్భంగా ఉభయ ప్రాంతాల మధ్య వైద్య సాంకేతికత, కృత్రిమ మేధ (AI), మరియు పరిశోధన రంగాల్లో పరస్పర సహకారంపై సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. తెలంగాణ ప్రభుత్వం ఇటీవలే ప్రవేశపెట్టిన 'నెక్స్ట్ జనరేషన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-30' ద్వారా రాష్ట్రం కేవలం తయారీ కేంద్రంగానే కాకుండా, ఆవిష్కరణల నిలయంగా మారబోతోందని మంత్రి వివరించారు. రాష్ట్రంలో ఉన్న ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల గురించి మంత్రి ఈ సందర్భంగా ప్రతినిధి బృందానికి వివరించారు. సుల్తాన్‌పూర్‌లోని మెడికల్ డివైజెస్ పార్క్ మరియు అంతర్జాతీయ గుర్తింపు పొందిన జీనోమ్ వ్యాలీ వంటి కేంద్రాలు అధునాతన వైద్య పరికరాల ఉత్పత్తికి అత్యంత అనుకూలమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా సరఫరా అవుతున్న వ్యాక్సిన్లలో గణనీయమైన భాగం హైదరాబాద్ నుండే ఉత్పత్తి అవుతున్న విషయాన్ని గుర్తు చేస్తూ, అదే స్ఫూర్తితో మెడికల్ ఎలక్ట్రానిక్స్ మరియు డయాగ్నోస్టిక్స్ రంగాల్లోనూ తెలంగాణ నంబర్ 1గా ఎదిగేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ఇంజనీరింగ్ మరియు మెడికల్ రంగాల్లోని ప్రతిభావంతులు అంతర్జాతీయ సంస్థలకు అదనపు బలమని ఆయన ఉద్ఘాటించారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**యాదాద్రి భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మంగళవారం భువనగిరి మండలంలోని వడపర్తి, హన్మాపురం గ్రామాలతో పాటు హుస్సేనాబాద్, బస్వాపూర్, చందుపట్ల, వీరవెల్లి గ్రామాల్లో ఐకేపీ, PACS ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని తెలిపారు. పంజాబ్, హర్యానా రాష్ట్రాల కంటే ఎక్కువ స్థాయిలో ధాన్యం తెలంగాణలో ఉత్పత్తి అవుతున్నదని, ఇది రాష్ట్ర రైతుల కష్టానికి నిదర్శనమని పేర్కొన్నారు. రైతులు తమ పండించిన ధాన్యాన్ని మధ్యవర్తుల వద్ద కాకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధరకు అమ్ముకోవాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా జరిగేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.అనంతరం వడపర్తి గ్రామంలోని ఐకేపీ ఆవరణలో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్లు, చైర్మన్లు, స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులు,రైతులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



## విద్యార్థుల ప్రతిభను వెలికితీసే దిశగా పలు అంశాల్లో పోటీలు

**యాదాద్రి భువనగిరి, మహా:** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా జిల్లాలో 85 ఎస్సీ,ఎస్టీ,బి.సి, మైనార్టీ సంక్షేమ హాస్టల్, రెసిడెన్షియల్ లో చదివే విద్యార్థుల ప్రతిభను వెలికితీసే దిశగా వివిధ సృజనాత్మక కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారు ఇందులో భాగంగా మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలో గల బి సి రెసిడెన్షియల్ స్కూల్ ను అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సందర్శించారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రెండో రోజైన విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి క్విజ్, ప్రసంగం, డిబేట్,డాన్స్,చిత్ర లేఖనం, వంటి పోటీలు నిర్వహించామని వివిధ సబ్జెక్టులపై విద్యార్థుల జ్ఞానాన్ని ఆలోచనా సామర్థ్యాన్ని పరీక్షించేందుకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల ద్వారా విద్యార్థులు తమలోని విశ్లేషణాత్మక దృష్టిని మెరుగుపరచుకుంటారని ఆయన అన్నారు. ప్రకృతి, సంస్కృతి, సామాజిక అంశాలపై సృజనాత్మక కల్పిస్తూ డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు కూడా నిర్వహించారు. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయడం జరిగింది.వసతి గృహాల వంట గదులు, ఆహార నాణ్యత ను పరిశీలించారు. పాఠశాలల లో విద్యార్థులకు అందిస్తున్న భోజనం శుభ్రంగా, రుచికరంగా ఉండేలా చూడాలన్నారు.వంటకు ఉపయోగిస్తున్న పదార్థాల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సరుకులు నాణ్యతతో ఉండాలని తెలిపారు.ఈ అన్ని పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించి ప్రశంసా పత్రాలు అందించారుఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ శ్యాంసుందర్ ,ప్రిన్సిపల్ , ఉపాధ్యాయులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వైభోపేతంగా 66వ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ జన్మదిన వేడుకలు



**సదాశివపేట, మహా :** స్థానిక సంగారెడ్డి శాసనసభ్యులు చింత ప్రభాకర్ 66 వ పుట్టినరోజు వేడుకలను సదాశివపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పట్టణ మరియు మండల గ్రామాలకు పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలను వైభోపేతంగా జరుపుకున్నారు. ఇట్టి కార్యక్రమంలో జహీరాబాద్ శాసనసభ్యులు మాణిక్ రావు. మాజీ డిసిసి శివ కుమార్. లతోపాటు నియోజకవర్గ నాయకులు పాల్గొని శాలువాతో సన్మానించి కేక్ కట్ చేయించి తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా సదాశివపేట పట్టణ మరియు మండల పార్టీ శ్రేణులు పాల్గొని జన్మదిన కేకును కట్ చేయించి మిఠాయిలు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ మండల పార్టీ అధ్యక్షులు శీల మల్లన్న. పెద్ద గొల్ల అంజన్న. సుధీర్ రెడ్డి. మాజీ వైస్ చైర్మన్.చింత గోపాల్. సాయినాథ్. కౌన్సిలర్ కొత్తగోల సోమశేఖర్. ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు దిద్దిగె నాగేష్. శ్రీధర్ రెడ్డి పెద్ద గొల్ల నాగేష్. లతీఫ్. మన్నె మల్లేశం. తదితర పట్టణ మండల పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ వలిగొండ పట్టణ అధ్యక్షులుగా జానకిరాములు

**వలిగొండ, మహా:** వలిగొండ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులుగా పోలె పాక జానకి రాములును నియమిస్తూ భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు ఈ సందర్భంగా జానకి రాములు మాట్లాడుతూ ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు

# కళ్యాణలక్ష్మీ & షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**



**యాదాద్రి భువనగిరి, మహా :**భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మంగళవారం భువనగిరి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కళ్యాణలక్ష్మీ & షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేశారుఈ సందర్భంగా భువనగిరి పట్టణానికి చెందిన 40 మంది, గ్రామీణ ప్రాంతాలకు చెందిన 24 మంది లబ్ధిదారులకు మొత్తం 64 మందికి రూ. 64,07,424 విలువ గల చెక్కులను ఎమ్మెల్యే అందించారు. ఈ పథకాలు పేద కుటుంబాల ఆర్థిక భారం తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు..

# ఎస్‌బీఐ ఏసీబీ బ్రాంచ్‌లో రూ. 2.65 కోట్ల భారీ మోసం!

- నిద్రాణమైన ఖాతాలే లక్ష్యంగా కేటుగాళ్ల పంజా..
- బ్యాంక్ మేనేజర్, హౌస్‌కీపింగ్ ఉద్యోగి సహా నలుగురి అరెస్ట్..
- రూ. 2.42 కోట్ల నగదు స్వాధీనం నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడి..









**నల్లగొండ, మహా :** నమ్మకంగా పనిచేయాల్సిన చోటే కన్నం వేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అడ్డు పెట్టుకుని నిద్రాణంగా ఉన్న ఖాతాల నుంచి కోట్లాది రూపాయలు కొల్లగొట్టారు. దేవరకొండ పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అగ్రికల్చరల్ కమర్షియల్ బ్రాంచ్ (ఏసీబీ) లో జరిగిన రూ. 2.65 కోట్ల భారీ ఆర్థిక మోసాన్ని నల్లగొండ జిల్లా పోలీసులు సమర్థవంతంగా ఛేదించారు. ఈ కేసులో సూర్యాపేట ఎస్‌బీఐ మేనేజర్, దేవరకొండ శాఖ హౌస్‌కీపింగ్ ఉద్యోగి సహా నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ. 2.42 కోట్ల భారీ నగదును స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడించారు . పోలీసుల కథనం ప్రకారం దేవరకొండ ఎస్‌బీఐ శాఖలో ఐదేళ్లుగా కాంట్రాక్ట్ హౌస్‌కీపింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న లెండల చక్రపాణికి కంప్యూటర్లపై పట్టు ఉండటంతో సిబ్బందికి తెలియకుండా బ్యాంకు అంతర్గత వ్యవహారాలను గమనించేవాడు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఇతనికి సూర్యాపేట ఎస్‌బీఐ మేనేజర్ పుట్ట వెంకట రామాంజనేయులుతో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ కలిసి అడ్డదారిలో డబ్బు సంపాదించాలని పథకం వేశారు. మేనేజర్ రామాంజనేయులు తనకున్న అధికారంతో గత కొన్నేళ్లుగా లావాదేవీలు జరగని 10 నిద్రాణమైన ఖాతాలను గుర్తించాడు. ఆ ఖాతాదారుల వివరాలు సేకరించి నకిలీ ఆధార్, పాన్ కార్డులు సృష్టించారు. అనంతరం బ్యాంకులో రద్దీగా ఉన్న సమయంలో చక్రపాణి సిబ్బంది లాగిన్ ఐడీలను దొంగతనంగా ఉపయోగించి ఆ ఖాతాలకు కొత్త మొబైల్ నంబర్లను అనుసంధానించాడు. యోనో యాప్ ద్వారా కొత్త పిన్ నంబర్లు సృష్టించి డబ్బును ఇతర ఖాతాలకు మళ్లించారు. ఈ మోసంలో నిందితులకు సహకరించిన కేతవత్ రాంలాల్, మారేపల్లి శివలు తమకు తెలిసిన వ్యక్తులకు కమిషన్ ఆశ చూపించి వారి ఖాతాల వివరాలు సేకరించారు. ఆ ఖాతాల్లోకి మళ్లించిన సొమ్మును విత్‌డ్రా చేసి వాటాలు పంచుకున్నారు. హైదరాబాద్ కోఠి బ్రాంచ్‌కు చెందిన ఒక ఖాతాదారునికి ఈమెయిల్ ద్వారా అలర్ట్ రావడంతో ఈ భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. దీనిపై ప్రస్తుత బ్రాంచ్ మేనేజర్ ఫణీంద్ర నీలకంఠ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగి నిందితులను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ. 1.10 కోట్ల నగదుతో పాటు, బెనిఫిషరీ ఖాతాల నుంచి మరో రూ. 1.31 కోట్లను రికవరీ చేశారు. వీటితో పాటు ఆరు ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసును వేగంగా ఛేదించిన డీఎస్పీ శ్రీనివాసరావు, ఇన్స్పెక్టర్ వెంకట రెడ్డి, ఎస్సై రాజు మరియు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# ఆన్ లైన్ విధానం ద్వారానే ఇసుక రవాణా జరపాలి

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

**యాదాద్రి భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లాలో ఇసుక సరఫరా పూర్తిగా మన ఇసుక వాహనం (MIV) ద్వారా ఆన్లైన్ లో ఇందిరమ్మ ఇళ్లకు, స్వంత ఇంటి అవసరాలకు మరియు ప్రభుత్వ పనుల నిమిత్తం బుకింగ్ చేసుకొని పొందాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు. జిల్లాలో (7) ఇసుక రీచులను గుర్తించడం జరిగింది. ఇట్టి రీచులు గుండాల, అడ్డగూడూరు, మోత్కూరు మరియు మోటకొండూరు మండలాలలో కలవని తెలిపారు.ఇసుక బుకింగ్ మరియు సరఫరా ఆన్లైన్ విధానం లో జరగాలని, మాన్యువల్ విధానానికి స్వస్తి పలకాలని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల ప్రకారం, జిల్లాలో ఇసుక సరఫరాకు ఆన్లైన్ విధానం ద్వారానే రూపొందించడం జరిగిందని తెలిపారు.మీ సేవ లేదా ఇంటర్నెట్ షాపుల నుంచి www.manaisukavahanam.com వెబ్సైట్ ద్వారా మరియు స్మార్ట్ ఫోన్ నుంచి మన ఇసుక వాహనం మొబైల్ యాప్ ద్వారా ఇసుక అవసరం ఉన్నవారు ఆన్లైన్ ద్వారా అప్లై చేసుకొని పొందవచ్చునారు.ఈ సందర్భంగా ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు మ్యానువల్ విధానానికి నిషేధిస్తూ జిల్లాలో పూర్తిగా ఆన్లైన్ ద్వారా ఇసుక బుకింగ్ మరియు రవాణా జరిగేలా మన ఇసుక వాహనం ఆన్లైన్ బుకింగ్ విధానాన్ని అమలు చేయడం జరుగుతోందన్నారు. దీనివల్ల ఇసుక అక్రమ రవాణాకు ఆస్కారం ఉండదన్నారు.ఇసుక రీచ్‌ల వద్ద నియమ నిబంధనలు కచ్చితంగా పాటించడంతో పాటు అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు.ప్రజలకు పారదర్శకంగా ఇసుక సరఫరా జరిగే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే, ఆన్లైన్ బుకింగ్ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.కావున అర్హులైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, స్వంత ఇంటి నిర్మాణం కొరకు మరియు ప్రభుత్వ నిర్మాణాలలో అవసరమైన ఇసుకను మన ఇసుక వాహనం (MIV) ద్వారా ఆన్లైన్ లో బుక్ చేసుకొని పొందాలని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణం కొరకు ఇసుకను ఎలాంటి చార్జీలు లేకుండా ఉచితంగా పొందవచ్చని తెలిపారు. ఇట్టి సమాచారం ను జిల్లాలోని ప్రజలకు అవగాహన కల్పించాలని ,సంబంధిత అధికారులకు సూచించారు.

# కోల్కూరు సదాశివుని ఆలయాన్ని చిన్న ఎంపీ రఘునందన్ రావు



**సదాశివపేట: మహా :** మండలంలోని కోల్కూరు శివారులో గల సదాశివ గుట్ట సదాశివ ఆలయాన్ని మంగళవారం మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు విచ్చేసిఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో ముందుంటానని. ఆలయం వరకు రోడ్డు నిర్మాణం పనుల కోసం తన వంతు కృషి ఉంటుందన్నారు . ఆ సదాశివుని కృపతో జిల్లాలోని ప్రజలందరూ సల్లంగుండాలని వేడుకొంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ ఒగ్గు మానిక్. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోవూరు సంగమేశ్వర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల మాణిక్ రావు. సారా కృష్ణ. శ్రీకాంత్ రాజ్.మండల పార్టీ అధ్యక్షుడు ఆదిత్య. శివలింగం. విక్రం రెడ్డి. హరీష్. బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# వారం రోజుల్లో ధాన్యం సేకరణ పూర్తి చేయాలి..

- అధికారులకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశం..
- ఎండకాలం దృష్ట్యా కేంద్రాల వద్ద వసతులు కల్పించాలి..
- పట్టణ రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి..





**నల్గొండ, మహా:** జిల్లాలోని ధాన్యం సేకరణను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి, రానున్న వారం పది రోజుల్లోనే ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం నల్గొండలోని తన క్యాంపు కార్యాలయం ఇందిరా భవన్‌లో జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్‌తో కలిసి పౌరసరఫరాలు, మార్కెటింగ్, రవాణా, కోఆపరేటివ్ తదితర శాఖల అధికారులు, రైస్ మిల్లర్లతో ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని రైతులు ఇబ్బంది పడకుండా కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, నీడ వంటి వసతులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. గడువులోగా సేకరణ పూర్తి చేసేందుకు అవసరమైతే రాత్రి వేళల్లోనూ లైట్లు ఏర్పాటు చేసి ధాన్యం సేకరణ చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా నల్గొండ నియోజకవర్గం లోనే సుమారు 2.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని, ఇక్కడ ప్రతిరోజూ 10 వేల మెట్రిక్ టన్నులకు తగ్గకుండా కొనుగోళ్లు జరగాలని స్పష్టం చేశారు. హమాలీల కొరత లేకుండా చూడాలని లారీల సంఖ్యను పెంచి సేకరించిన ధాన్యాన్ని వెనువెంటనే మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ధాన్యం దిగుమతిలో రైస్ మిల్లర్లు జాప్యం చేయకుండా సహకరించాలని కోరిన మంత్రి.. కనగల్, ధర్వేశిపురం వంటి ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న వ్యవసాయ గోదాములను ధాన్యం నిల్వకు వినియోగించుకోవాలని మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఇంకా 10 శాతం మేర కోతలు పెండింగ్‌లో ఉన్నాయని రైతులు ధాన్యాన్ని రోడ్లపై పోయకుండా అవసరమైతే పాఠశాల భవనాలు, ఫంక్షన్ హాళ్లను కొనుగోలు కేంద్రాలుగా మార్చాలని సూచించారు.

**నల్గొండను సుందరంగా తీర్చిదిద్దుతాం..**

అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిపై తనకున్న దార్శనికతను పంచుకున్నారు. రహదారులు, భవనాల శాఖ ద్వారా జిల్లాలోని ప్రధాన రహదారులన్నింటిని అభివృద్ధి చేస్తున్నామని ఔటర్‌రింగ్ రోడ్డు పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ తరహాలో నల్గొండ పట్టణం చుట్టూ రోడ్లను ఏర్పాటు చేసి, ఎస్ఎల్‌బీసీ నిధులతో సీసీ రోడ్ల పనులను పూర్తి చేస్తామన్నారు. పట్టణంలోని పార్కుల అభివృద్ధి ప్రణాళికలు సిద్ధమయ్యాయని వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా వార్డుల వారీగా కృష్ణా జలాలను ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ కలెక్టర్ జె.శ్రీనివాస్, అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి, పౌర సరఫరాల అధికారి వెంకటేశం, ఏడీ చాయాదేవి, డీసీఓ పత్యా నాయక్, డీఆర్‌డీఓ శేఖర్ రెడ్డి, వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చదువుల తల్లికి 'సుశీలమ్మ ఫౌండేషన్' చేయూత..

- 151 మంది విద్యార్థులకు రూ. 24.50 లక్షల ప్రోత్సాహకాలు..
- బడిని గుడిలా భావిస్తా...ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి..
- విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే ఫౌండేషన్ లక్ష్యం కోమటిరెడ్డి లక్ష్మి..







**మునుగోడు,మహా :** ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తూ పేద విద్యార్థుల ఉన్నత చదువులకు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దంపతులు అండగా నిలిచారు. కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 18 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 202526 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 151 మంది విద్యార్థులకు మంగళవారం భారీ నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి, ఫౌండేషన్ చైర్‌పర్సన్ లక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి పారితోషకాల పంపిణీని ప్రారంభించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు వరుసగా రూ. 25,000, రూ. 15,000, రూ. 10,000 చొప్పున మొత్తం రూ. 24,50,000 నగదును చెక్కుల రూపంలో జ్ఞాపికలతో కలిపి అందజేశారు. గతేడాది 62 ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు రూ. 20 లక్షల వరకు సాయం అందించిన ఫౌండేషన్, ఈ ఏడాది ఇంటర్ విద్యార్థులకు కూడా చేయూతనిచ్చి వారిలో పోటీ తత్వాన్ని పెంచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యను, బడిని తాను గుడితో సమానంగా భావిస్తానని పేర్కొన్నారు. "మన కోసం మనం బ్రతకడం కాదు.. పదిమందికి సాయం చేస్తూ బ్రతకడమే గొప్పతనం" అని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం విద్యా, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెస్తోందని ప్రభుత్వ బడుల్లో చదువుకునే పిల్లలకు అండగా ఉండటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు. యువత సెల్ ఫోన్లకు, డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రులు నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. సమాజం కోసం తనకంటే ఎక్కువగా తన శ్రీమతి లక్ష్మి పరితపిస్తుందని కరోనా కాలంలోనూ ఆమె ఎంతో సేవ చేసిందని ఈ సందర్భంగా కొనియాడారు.

**నిరంతరం అండగా ఉంటాం..**

ఫౌండేషన్ చైర్‌పర్సన్ లక్ష్మి మాట్లాడుతూ.. మునుగోడు విద్యార్థుల మాటలు తమకు ఎంతో స్ఫూర్తినిచ్చాయని భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని ఏ ప్రాంతంలోనైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. దేవుడు ఇచ్చిన దానిలో తోచినంత ఇతరులకు సాయం చేయడమే తమ ఫౌండేషన్ ఆశయమని తెలిపారు. తమ నుంచి సాయం పొందిన విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి తిరిగి సాయం చేయాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నేతలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వడ్డెరుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది..

- నామినేటెడ్ పదవుల్లో సముచిత ప్రాధాన్యత ఇస్తాం..
- పెండింగ్ బిల్లులు ఇప్పటికే విడుదల చేశాం..
- రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడి..






**నల్లగొండ, మహా :** నిరంతరం కష్టపడి పని చేసే వడ్డెర సోదరుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెన్నార్ గార్డెన్స్‌లో నిర్వహించిన అఖిలభారత వడ్డెర సంక్షేమ సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీ జగద్గురు ఇమ్మడి సిద్ధ రామేశ్వర స్వామి సమక్షంలో జరిగిన ఈ సభలో మంత్రి వడ్డెర సామాజిక వర్గానికి పలు కీలక హామీలు ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వడ్డెరులకు సంబంధించిన పెండింగ్ బిల్లులన్నింటినీ విడుదల చేశామని గుర్తు చేశారు. వచ్చే నెలలో భర్తీ చేయనున్న నామినేటెడ్ పదవుల్లో వడ్డెరులకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. వడ్డెరుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే బాధ్యతను తాను తీసుకుంటానని భరోసా ఇచ్చారు. నల్లగొండ పట్టణంలో నిర్మాణ దశలో ఉన్న వడ్డెర సంఘం భవనాన్ని త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని మంత్రి ప్రకటించారు. సంఘం అధ్యక్షులు అలకుంట్ల నాగరత్నం రాజు అధ్యక్షతన జరిగిన ఈ సభలో వడ్డెర సామాజిక వర్గ ప్రతినిధులు భారీగా పాల్గొన్నారు. ఎమ్మెన్నార్ గార్డెన్స్ జనసందోహంతో నిండిపోయింది. ఈ కార్యక్రమంలో నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, ఎంబీసీ చైర్మన్ జరిపేటి జైపాల్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ గోగుల సరిత, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి పాల్గొన్నారు. వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు మంజుల రమేష్, జాతీయ ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వంటిపుల్లి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు గుంజ వెంకట్ నారాయణ, జిల్లా అధ్యక్షులు వేముల సుధాకర్, కార్పొరేటర్లు ఆలకుంట్ల ఝాన్సీ రాణి, ఆలకుంట్ల నాగరాజుతో పాటు యాదాద్రి జిల్లా అధ్యక్షులు గుర్రం కుమారస్వామి, పల్లపు దుర్గయ్య, పల్లపు నారాయణ, రవి తదితరులు పాల్గొని వడ్డెర సామాజిక వర్గ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రసంగించారు.

# నాచారంలో విషాదం

## రీల్స్ వ్యామోహంతో బలైన బాలుడు..



**కుషాయిగూడ, మహా :** రీల్స్ చేస్తూ గుర్తింపు తెచ్చుకోవాలనుకున్న 14 ఏళ్ల బాలుడి సాహసం వికటించి మృత్యువాత పడిన ఘటన నాచారం పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన ఓ కుటుంబం ఉపాధి కోసం నగరానికి వచ్చి మల్లాపూర్ పరిధిలోని గాంధీ బొమ్మ సమీపంలో నివసిస్తోంది. ఆ కుటుంబానికి చెందిన మితున్ (14) స్థానిక పాఠశాలలో చదువుకుంటున్నాడు. గత కొంతకాలంగా తన స్నేహితులు, తోటివారు సోషల్ మీడియాలో రీల్స్ చేస్తూ ఫేమస్ అవ్వడం చూసిన మితున్, తను కూడా అటువంటి వీడియోలతో గుర్తింపు పొందాలని ఆశపడి తోటి వారిలా కాకుండా కాస్త భిన్నంగా రిస్కీ స్కిట్స్ చేస్తే త్వరగా ఫేమస్ కావాలనుకున్నాడు. తన నివాసంలోని బాల్కనీ రైలింగ్ పై ప్రమాదకరమైన ఫీట్లు చేస్తూ రీల్స్ చిత్రీకరించేందుకు ప్రయత్నించి ఒక్కసారిగా పట్టుతప్పి భవనం పైనుంచి కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించేలోగా ప్రాణాలు కోల్పోయాడు.

# కాప్రా పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా చక్రస్నానం



**కుషాయిగూడ, మహా :** కాప్రా చెన్నకేశవ స్వామి ఆలయంలో 14 సంవత్సరాల క్రితం ప్రతిష్ఠించిన శ్రీ జయమంగళ పంచముఖ ఆంజనేయ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా సుదర్శన హోమం, హనుమాన్ హోమం, జాంబవంతుని హోమం, చక్ర స్నానం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సమీప కాలనీల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై భక్తి శ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, విశ్వ హిందూ పరిషత్ ఆల్ ఇండియా గవర్నింగ్ కమిటీ సభ్యులు రాఘవులు, తెలంగాణ రాష్ట్ర గవర్నింగ్ కమిటీ సభ్యులు లక్ష్మీ శేఖర్, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, ఈఓ కృష్ణమాచార్యులు, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నల్లూరి శివరామకృష్ణ ప్రసాద్, డాక్టర్ కొండారెడ్డి, డీఎన్. ప్రసాద్, కమిటీ మాజీ సభ్యులు పీసర మల్లారెడ్డి, నరేందర్ గౌడ్, శంకర్ బాబు, మురళి పంతులు, విజయేందర్ రెడ్డి, మోహన్, గజేందర్ రెడ్డి, ఆలయ జూనియర్ అసిస్టెంట్ టి. శ్రీనివాస్, ముఖేష్, మోహన్, విశ్వం తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. సోలిస్ కంటి ఆసుపత్రి సిబ్బంది సేవలు అందజేశారు.

# రైతు ముంగిట ధాన్యం కొనుగోళ్లు

## కామారెడ్డిలో పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆకస్మిక తనిఖీ



**కామారెడ్డి, మహా:** రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడమే కాకుండా, రైతులకు ఒక్క రూపాయి కూడా ఆలస్యం కాకుండా వారి ఖాతాల్లో నగదు జమ చేయడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. బుధవారం కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలో పర్యటించిన ఆయన, క్షేత్రస్థాయిలో జరుగుతున్న ధాన్యం సేకరణ తీరుతెన్నులను క్షుణ్ణంగా పరిశీలించారు. గర్గుల్ గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, కేంద్రంతో పాటు, గోకుల్ తండాలోని ఇందిరా క్రాంతి పథం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి, అక్కడ అందుతున్న సదుపాయాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి గింజనూ నిబంధనల ప్రకారం కొనుగోలు చేయాలని ఆయన ఆదేశించారు.రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు అత్యంత పారదర్శకంగా సాగుతున్నాయని వెల్లడించిన కమిషనర్, ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు వివరించారు. ఇందుకు సంబంధించి 26 కోట్ల రూపాయలను ఇప్పటికే రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ చేశామని, ఇది ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఒక్క కామారెడ్డి జిల్లాలోనే ఇప్పటివరకు 35,300 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తయిందని, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తూ రైతుల ఇబ్బందులను తొలగిస్తోందని కొనియాడారు. క్షేత్రస్థాయిలో తూకం వేసిన ధాన్యాన్ని వెనువెంటనే మిల్లులకు తరలించేలా రవాణా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని సూచించారు. ముఖ్యంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ వినియోగంలో సిబ్బంది వేగాన్ని పెంచాలని కమిషనర్ దిశానిర్దేశం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరించిన వెంటనే వివరాలను ట్యాబ్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఈ ప్రక్రియలో జాప్యం జరిగితే రైతుల చెల్లింపులకు ఆటంకం కలిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డేటా ఎంట్రీ అప్పటికప్పుడు పూర్తి చేయడం ద్వారా నగదు బదిలీ ప్రక్రియ సులభతరం అవుతుందని ఆయన వివరించారు. పర్యటనలో భాగంగా ధాన్యం రాశులను పరిశీలించిన స్టీఫెన్ రవీంద్ర, తేమ శాతం పరీక్షించే యంత్రాలను, తూకం యంత్రాలను స్వయంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూనే, రైతులకు మద్దతు ధర దక్కేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ ఆకస్మిక తనిఖీలో కమిషనర్‌తో పాటు జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా పౌరసరఫరాల అధికారి , పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ , ఇతర కీలక శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి , జిల్లా సహకార అధికారి , మార్కెటింగ్ శాఖ ఏడీ తదితరులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని కమిషనర్ సూచించారు. అన్నదాతకు ఎక్కడా అన్యాయం జరగకుండా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పకడ్బందీగా కొనుగోళ్లు జరపాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. రైతుల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, వారి కష్టానికి తగిన ప్రతిఫలం సకాలంలో అందేలా చూడటమే ఈ భారీ కసరత్తు వెనుక ఉన్న అసలు ఉద్దేశమని ఆయన పునరుద్ఘాటించారు.

# ముఖ్యమంత్రితో ఐటీ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ భేటీ

## జూబ్లీహిల్స్ నివాసంలో మర్యాదపూర్వక సందర్శన



**హైదరాబాద్, మహా:** తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని ఆదాయపు పన్ను శాఖ (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ సురేష్ బత్తిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసానికి చేరుకున్న ఆయన, తన బాధ్యతల స్వీకరణ అనంతరం గౌరవపూర్వకంగా సీఎంను సందర్శించారు. ఈ సందర్భంగా సురేష్ బత్తినితో పాటు పలువురు ఆదాయపు పన్ను శాఖ ఉన్నతాధికారులు కూడా ముఖ్యమంత్రిని కలిశారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా సురేష్ బత్తిని ఇటీవలే బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో, ఈ కలయిక ప్రాధాన్యత సంతరించుకుంది.రెండు రాష్ట్రాలకు సంబంధించిన కీలక రెవెన్యూ విభాగానికి అధిపతిగా నియమితులైన సురేష్ బత్తినిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర అభివృద్ధిలో ఆదాయపు పన్ను శాఖ పాత్ర మరియు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉండాల్సిన సమన్వయం గురించి ఈ సందర్భంగా చర్చకు వచ్చినట్లు సమాచారం. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్‌కు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలుపుతూ, పాలనలో మరియు ఆర్థిక క్రమశిక్షణలో ఆదాయపు పన్ను శాఖ అందించే సహకారం కీలకమని పేర్కొన్నారు.

# ఉద్యమ సాహిత్య యోధుడికి గుర్తింపు

## మోహన్ బైరాగికి అవార్డు



**కుషాయిగూడ, మహా :** తెలంగాణ ఉద్యమకారుడు, కవి, రచయిత, సీనియర్ జర్నలిస్ట్ మోహన్ బైరాగికి 'అయిలా పండరినాథ్ స్మారక అవార్డు' ప్రదానం చేశారు. అభినందన కల్చరల్ సొసైటీ (పెంబర్తి) ఆధ్వర్యంలో జనగామ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా పద్మశ్రీ గ్రహీత గడ్డం సమ్మయ్య, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి, నెల్లుట్ల రమాదేవి, డాక్టర్ మాచర్ల బిక్షపతి, రవీందర్ రావు, హైకోర్టు న్యాయవాది సాదిక్ అలీ, అయిలా సోమ నర్సింహాచారి తదితరులు మోహన్ బైరాగిని సన్మానించారు. వక్తలు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సాహిత్య యోధుడిగా మోహన్ బైరాగి ప్రత్యేక గుర్తింపు పొందారన్నారు. 1996నుంచి ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటూ, తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆయన రచనల్లో తెలంగాణ అస్తిత్వం, అమరవీరుల గాథలు, ప్రజా సమస్యలు ప్రధాన అంశాలుగా ప్రతిబింబించాయని చెప్పారు. 1998లో సాహిత్య ప్రస్థానం ప్రారంభించిన ఆయన ఇప్పటి వరకు సుమారు 70 పాటలు, 30 కవితలు రచించినట్లు వివరించారు. మలి దశ ఉద్యమంలో పాల్గొని కొంతకాలం జైలు జీవితం గడిపారని తెలిపారు. ఉద్యమ స్ఫూర్తితో కూడిన ఆయన రచనలు సాంస్కృతిక వేదికలపై విస్తృతంగా ప్రాచుర్యం పొందాయని పేర్కొన్నారు. మోహన్ బైరాగి ప్రస్తుతం అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా, తెలంగాణ సినిమా వేదిక ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతూ ఉద్యమ కళాకారుల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తున్నారని తెలిపారు. అవార్డు స్వీకరించిన మోహన్ బైరాగి మాట్లాడుతూ, ఈ అవార్డు తనపై మరింత బాధ్యత పెంచిందని, నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# రూ. 250 కోట్ల మోసం

## కుషాయిగూడలో రైతుల ధర్నా



**కుషాయిగూడ, మహా :** పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద భూములు కోల్పోయిన నాగర్‌కర్నూలు జిల్లా రైతులు కుషాయిగూడలో మంగళవారం ఆందోళనకు దిగారు. తమ నష్టపరిహారం డబ్బులను ఓం శ్రీ సాయిరాం ఫైనాన్స్ సంస్థ పేరుతో మోసం చేశారని ఆరోపించారు. ఈ మేరకు సుభాష్‌నగర్‌లో నివసిస్తున్న నిందితుడు ధనుంజయ్ గుప్తా ఇంటి ముందు బైఠాయించి నిరసన తెలిపారు. బాధితుల వివరాల ప్రకారం, తక్కువ ధరలో భూములు ఇప్పిస్తామని, అధిక వడ్డీ ఇస్తామని నమ్మబలికి సుమారు 25 గ్రామాలకు చెందిన సుమారు 3000 మంది రైతుల నుంచి దాదాపు రూ. 250 కోట్లు వసూలు చేసి మోసగించినట్లు ఆరోపించారు. ఈ వ్యవహారంలో ఇట్యాల సాయిబాబా, ధనుంజయ్ గుప్తా, బాలీశ్వర్, తుకారాం, నాగం కరుణాకర్ రెడ్డి, బుచ్చిరెడ్డి, జానకి రాంరెడ్డి, శ్రీనివాస్ తదితరుల ప్రమేయం ఉన్నట్లు తెలిపారు. మోసపోయిన విషయం తెలిసి బాధితులు హైకోర్టును ఆశ్రయించగా, నిందితుల ఆస్తులను జప్తు చేసినట్లు సమాచారం. నిందితుడిని అరెస్ట్ చేసి తమకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పాశం యాదగిరి మాట్లాడుతూ, భూములు కోల్పోయిన రైతులకు ఇవ్వాల్సిన పునరావాస ప్యాకేజీ అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# తుమ్మలకు పువ్వాడ బహిరంగ సవాల్

## అక్రమమైతే చర్యలు తీసుకో.. లేదంటే ముక్కు నేలకు రాయి

**హైదరాబాద్, మహా:** ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాల్లో చిరకాల ప్రత్యర్థులుగా ఉన్న మంత్రులు, మాజీ మంత్రుల మధ్య మాటల యుద్ధం మరోసారి తారాస్థాయికి చేరింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పువ్వాడ అజయ్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'ఖబడ్దార్ తుమ్మల' అంటూ తీవ్ర స్వరంతో హెచ్చరించిన పువ్వాడ.. ప్రజా సమస్యలపై ప్రతిపక్షంగా నిలదీసే తమ గొంతును నొక్కడం ఎవరి తరం కాదని స్పష్టం చేశారు. మంగళవారం ఖమ్మంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మంత్రి తుమ్మల చేస్తున్న ఆరోపణలను సాక్ష్యాధారాలతో తిప్పికొట్టారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే బీఆర్ఎస్ పార్టీపై, తమ నాయకత్వంపై విషం కక్కుతున్నారని మండిపడ్డారు.బీఆర్ఎస్ సభ నిర్వహించిన ప్రాంగణం కబ్జా భూమి అంటూ మంత్రి చేసిన వ్యాఖ్యలపై పువ్వాడ అజయ్ ఘాటుగా స్పందించారు. "ప్రస్తుతం నువ్వు అధికారంలో ఉన్నావు.. అధికార యంత్రాంగం నీ చేతుల్లోనే ఉంది. ఆ ప్రాంగణం కబ్జాకు గురైందని నీకు నిజంగా అనిపిస్తే, వెంటనే విచారణ జరిపించి యాక్షన్ తీసుకో.. అంతే తప్ప బురద చల్లడం మానుకో" అని సవాల్ విసిరారు. ఒకవేళ ఆ భూమి అక్రమం కాదని తేలితే, ప్రజల ముందుకొచ్చి ముక్కు నేలకు రాస్తావా? అని నిలదీశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఆధారాలు లేకుండా మాట్లాడటం మంత్రి హోదాకు తగదని హితవు పలికారు. నిజానికి గిరిజనుల భూములను కబ్జా చేసిన చరిత్ర ఎవరిదో జిల్లా ప్రజలకు బాగా తెలుసని, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ తుమ్మల నాగేశ్వరరావేనని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజలకు ఉపయోగపడే పనులు చేయడంలో పూర్తిగా విఫలమైందని పువ్వాడ విమర్శించారు. కేవలం బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని అపహాస్యం చేయడం, గత ప్రభుత్వంపై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్న అసమర్థ ప్రభుత్వం ఇదని దుయ్యబట్టారు.

# జగిత్యాల స్పీచ్ అంతా పిట్టకథలే..

## ప్రభుత్వ విప్ వేముల వీరేశం ఘాటు విమర్శలు

**హైదరాబాద్, మహా:** భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అధినేత కేసీఆర్ జగిత్యాల బహిరంగ సభలో చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణులు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాయి. మంగళవారం అసెంబ్లీలోని సీఎల్పీ మీడియా సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కేసీఆర్‌పై నిప్పులు చెరిగారు. జగిత్యాల సభలో కేసీఆర్ చేసిన ప్రసంగం అంతా 'పిట్టకథలు, ఉత్తమాటల' సమాహారమని, అందులో విషయం కంటే విషమే ఎక్కువగా ఉందని ఆయన మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, రాష్ట్రప్రభుత్వాన్ని బదనాం చేయడమే లక్ష్యంగా కేసీఆర్ అబద్ధపు ప్రచారానికి తెరలేపారని ధ్వజమెత్తారు. దొరల గడీలను బద్దలు కొట్టాలని నినదించిన ప్రజాకవి అలిశెట్టి ప్రభాకర్ పేరును కేసీఆర్ తన స్వార్థం కోసం వాడుకోవడం వల్ల ఆ కవి ఆత్మ ఘోషిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసిన ఉద్యమకారులను, సీనియర్ నాయకులను కేసీఆర్ తన పదేళ్ల పాలనలో నిరంతరం అవమానిస్తూనే వచ్చారని వీరేశం ఆరోపించారు. విజయశాంతి, ఈటల రాజేందర్, నాగం జనార్దన్ రెడ్డి, నాయిని నర్సింహారెడ్డి, రవీంద్ర నాయక్ వంటి ఎందరో నాయకులను నట్టేట ముంచిన చరిత్ర కేసీఆర్‌దని, ఆయనకు మనుషుల విలువ తెలియదని విమర్శించారు. కేసీఆర్ అవమానించిన వారి జాబితా రాస్తే 'రామాయణమంత' ఉంటుందని ఎద్దేవా చేశారు. తాను కూడా కేసీఆర్ చేతిలో మోసపోయిన వాడినేనని, తనను పార్టీలోకి ఆహ్వానించి మంచి పదవి ఇస్తానని చెప్పి.. ఇరవై సార్లు దండలు పెట్టినా కనీసం సభ్యత్వం కూడా ఇవ్వకుండా కాలయాపన చేశారని తన వ్యక్తిగత అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు. తెలంగాణ వాదాన్ని, ఉద్యమ నినాదాన్ని కేసీఆర్ పూర్తిగా కబ్జా చేశారని ఆయన ఆరోపించారు.మిషన్ భగీరథ పథకంపై కేసీఆర్ చేస్తున్న గొప్పలు క్షేత్రస్థాయిలో ఎక్కడా కనిపించడం లేదని వీరేశం సవాల్ విసిరారు. "మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నీళ్లు ఇవ్వకపోతే ఓట్లు అడగనని ఆనాడు ప్రగల్భాలు పలికిన కేసీఆర్.. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని మాట్లాడుతున్నారు?" అని ప్రశ్నించారు. తన నియోజకవర్గమైన నకిరేకల్‌లో ఏ ఒక్క గ్రామంలోనైనా ఇంటింటికీ శుద్ధ జలం అందుతున్నట్లు నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని బహిరంగ సవాల్ విసిరారు. గొర్రెల స్కామ్, లిక్కర్ స్కామ్, దళిత బంధు అక్రమాల నుంచి అమరవీరుల స్థూపం వరకు ప్రతి పనిలోనూ కేసీఆర్ కుటుంబం అవినీతికి పాల్పడిందని దుయ్యబట్టారు. ప్రగతి భవన్ ఇనుప కంచెలు బద్దలై ప్రజలకు స్వేచ్ఛ దక్కడాన్ని కేసీఆర్ జీర్ణించుకోలేకపోతున్నారని, అందుకే ప్రభుత్వంపై అకారణంగా విమర్శలు గుప్పిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.హైడ్రా , మూసీ ప్రక్షాళన ప్రాజెక్టులపై కేసీఆర్ ద్వంద్వ వైఖరిని వీరేశం ఎండగట్టారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు హైదరాబాద్‌లో 28 వేల అక్రమ కట్టడాలను కూల్చివేస్తామని, ఇందుకు మీడియా సహకరించాలని కేసీఆరే స్వయంగా కోరారని గుర్తు చేశారు. ఇప్పుడు తమ ప్రభుత్వం హైడ్రా ద్వారా 50 వేల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను కాపాడుతుంటే ఎందుకు ఏడుస్తున్నారని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన ద్వారా నల్గొండ, రంగారెడ్డి జిల్లాల రైతులకు మేలు జరుగుతుంటే, రేవంత్ రెడ్డికి ఎక్కడ మంచి పేరు వస్తుందోననే అక్కసుతోనే కేసీఆర్ విషం చిమ్ముతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ ఇప్పట్లో బతికి బట్టకట్టే అవకాశం లేదని, కేసీఆర్ ఎన్ని పిట్టకథలు చెప్పినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఆయన స్పష్టం చేశారు. పెద్ద మనిషిగా కేసీఆర్ తన గౌరవాన్ని కాపాడుకోవాలని, విషపూరిత పదజాలాన్ని వాడటం మానుకోవాలని ఆయన హితవు పలికారు.



# అమ్మో గ్లామర్‌తో చంపేస్తుందిగా..

ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా కొనసాగాలి అంటే తప్పకుండా అందం, అభినయం మాత్రమే కాదు అదృష్టం కూడా కలిసి రావాలి అంటారు.ఇక అందాల ముద్దుగుమ్మ ప్రగ్యాజైస్వాల్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఉన్న ఈ చిన్నదానికి లక్కు కలిసిరాలేదని చెప్పాలి.

### ప్రగ్యాజైస్వాల్

మిర్చిలాంటి కుర్రాడు సినిమాతో వెండితెరకు పరిచయమైన ఈ బ్యూటీ మొదటి సినిమాతోనే తన కంటూ ఓ స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకుంది.

### మిర్చి లాంటి కుర్రాడు

తన అందం, అభినయంతో అందరి మనసులు దోచేసుకుంది. దీని తర్వాత చాలా అవకాశాలు వచ్చాయి. దీంతో చాలా సినిమాల్లో నటించింది.

### అందం, అభినయం

ముఖ్యంగా వరుణ్ తేజ్ సరసన కంచె మూవీలో నటించి, తన నటతో యూత్ ఫేవరెట్ హీరోయిన్ అయిపోయింది.

### కంచె మూవీ

ఇక ఈ మూవీ తర్వాత అఖండ సినిమాలో నటించి మెప్పించింది. అంతే కాకుండా ఈ మూవీ తర్వాత బాలయ్య సరసన డాకు మహారాజ్ మూవీలో కూడా నటించి మెప్పించింది.

### అఖండ సినిమా

ప్రస్తుతం ఈ బ్యూటీకి తెలుగులో అవకాశాలు తగ్గిపోయాయి. కానీ తమిళం, హిందీ సినిమాలతో ఫుల్ బిజీగా గడిపేస్తుంది.

### ఫుల్ బిజీ

ఇక ఎప్పడు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ అందాల ముద్దుగుమ్మ తాజాగా గోల్డ్ కలర్ డ్రెస్, బ్యూటిపుల్ ఫొటోస్ షేర్ చేసింది.



# వరుస సినిమాలతో దూసుకుపోతున్న అందమా మీనాక్షి

మీనాక్షి చౌదరి.. తెలుగులో తిరుగులేని హీరోయిన్ గా క్రేజ్ తెచ్చుకుంది మీనాక్షి చౌదరి. ఈ యంగ్ బ్యూటీ వరుస సినిమాలతో దుమ్మురేపుతోంది. హిట్లు ఫ్లాప్స్ తో సంబంధం లేకుండా వరుసగా ఆఫర్స్ అందుకుంటూ రాణిస్తుంది అందాల భామ మీనాక్షి చౌదరి. యంగ్ హీరోల సరసన నటిస్తూ బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంది. తెలుగుతో పాటు తమిళ్ లోనూ ఈ అమ్మడు నటిస్తుంది. చివరిగా నవీన్ పోలిశెట్టి హీరోగా నటించిన అనగనగా ఒక రాజు సినిమాలో హీరోయిన్ గా చేసింది. సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఇక ఇప్పడు క్రేజీ ఆఫర్స్ రెడీగాఉన్నాయి. మీనాక్షి ప్రస్తుతం చేతినిండా సినిమాలతో యమా బిజీగా గడుపుతుంది. సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ ఆకట్టుకుంటుంది. నెట్టింట క్రేజీ ఫోటోలను షేర్ చేస్తూ అభిమానులను కవ్విస్తుంది మీనాక్షి చౌదరి. ఈ ముద్దుగుమ్మ ఫోటోలు తెగ వైరల్ అవుతున్నాయి.



# వాడినే పెళ్లి చేసుకుంటా..

కన్నడ పరిశ్రమ నుంచి టాలీవుడ్‌లోకి అడుగుపెట్టి, అనతి కాలంలోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి ఆషికా రంగనాథ్. 'అమిగోస్' సినిమాతో పరిచయమైంది. నా సామీ రంగా'తో ప్రేక్షకులకు చేరువైన ఈమె, తాజాగా రవితేజ సరసన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమాతో ఇటీవలే ప్రేక్షకులను అలరించింది ఈ ముద్దుగుమ్మ. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు పంచుకుంది. కళ్యాణ్ రామ్ చాలా ప్రైవేట్ పర్సన్ అని, కుటుంబానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తారని తెలిపింది ఆషికా. నాగార్జున చార్మింగ్ అని, అంత పెద్ద స్టార్ అయ్యుండి కూడా తోటి నటుల గురించి తెలుసుకోవడానికి ఆసక్తి చూపుతారని చెప్పకొచ్చింది ఆషికా రంగనాథ్.రవితేజ జీవితాన్ని చాలా ఈజీగా తీసుకుంటారని, సెట్‌లో ఆయన ఉంటే సందడే వేరని పేర్కొన్నారు. కాబోయే భర్త గురించి స్పందిస్తూ ఆషికా కొన్ని ఆసక్తికర నియమాలను బయటపెట్టారు.తనకు కాబోయే భర్త తనను గౌరవించాలని, తన నటన పట్ల ఉన్న ఇష్టాన్ని గౌరవిస్తూ కెరీర్‌లో ప్రోత్సహించాలని కోరుకుంటున్నారు. అలాగే తనకు కొంచెం ఓసీడీ (OCD) ఉందని తెలిపింది. పరిశుభ్రత విషయంలో అస్సలు రాజీపడనని, తన భాగస్వామి కూడా అలాగే ఉండాలని తెలిపారు. తాను పనిచేసిన హీరోలలో నందమూరి కళ్యాణ్ రామ్ 'పర్ఫెక్ట్ హజ్బెండ్ మెటీరియల్' అని అన్నారు. సెట్‌లో మాట్లాడేటప్పడు ఆయన తన భార్య స్వాతి గురించి గొప్పగా చెబుతారని, తన భర్తలో కూడా కళ్యాణ్ రామ్ గారిలో ఉన్నటువంటి ఉత్తమ లక్షణాలు ఉండాలని అన్నారు.



# బొమ్మ అనుకుంటే పొరపాటే గురూ..

ఏంటీ ఈ ఫొటో చూసి బార్బీ బొమ్మ చాలా బాగుంది అనుకుంటున్నారా? అయితే మీరు పప్పలో కాలు వేసినట్లే, ఎందుకంటే ఈ ఫొటోలో ఉంది క్రేజీ నటి.ఈ ఫొటోలో కనిపిస్తున్న బ్యూటీ, అందాల చిన్నది ఊర్వశీ రౌతేలా. ఈ ముద్దుగుమ్మ గురించి ఎంత చెప్పినా తక్కువే.అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. ఇక ఈ అమ్మడు అందానికి ఎవరు అయినా సరే ఫిదా అవ్వాల్సిందే, అంతలా తన క్యూట్ లుక్స్‌తో ఆకట్టుకుంటుంది.బాలీవుడ్‌లో పలు సినిమాల్లో నటించి మెప్పించిన ఈ బ్యూటీ, తెలుగులో స్పెషల్ సాంగ్స్ చేస్తూ అందరి మనసు దోచేసుకుంది.అంతే కాకుండా ఈ అమ్మడు 2015 లో మిస్ దివా యూనివర్సిటీ టైటిల్ కిరీటాన్ని కూడా సొంతం చేసుకుంది.సింగ్ సాబ్ ది గ్రేట్ అనే చిత్రంతో ఇండస్ట్రీలోకి అడుగు పెట్టిన ఈ బ్యూటీ, వాల్తేరు వీరయ్య మూవీలో నటించి మెప్పించింది.అంతే కాకుండా చాలా సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ చేసి, తన డ్యాన్స్, గ్లామర్‌తో ప్రతి ఒక్కరినీ తన వైపు తిప్పకుంది.ఇక ఎప్పడూ సోషల్ మీడియాలో చాలా క్యూట్‌గా ఉండే ఈ చిన్నది అచ్చం బార్బి బొమ్మలా ఉన్న ఫొటోస్ తన ఇన్ స్టాలో షేర్ చేసింది. ప్రస్తుతం ఈ ఫొటోస్ వైరల్ అవుతున్నాయి

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com